


పకడ్బందీ ఏర్పాట్లు


సభా ప్రాంగణంలో కొనసాగుతున్న పనులు

- 16న కర్నూలుకు ప్రధాన మంత్రి రాక
- 'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్' సభలో పాల్గొననున్న మోదీ
- రాగమయూరి వెంచర్‌లో సభ ఏర్పాట్లు
- సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష
- సమన్వయంతో దిగ్విజయం చేయాలని రెండు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలకు సూచనలు
- భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన అడిషనల్ డీజీ మధుసూదన్‌రెడ్డి

కర్నూలు/కర్నూలు క్రైం/ఓర్వకల్లు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 16న కర్నూలు, శ్రీశైలంలో పర్యటించనున్నారు. సూపర్ జీఎస్టీ - సూపర్ 'సేవింగ్స్' పేరిట జరిగే జీఎస్టీ-2.0 సంస్కరణలు, ప్రయోజనాలపై ప్రజల అవగాహన సభలో పాల్గొననున్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ హాజరయ్యే ఈ సభను దిగ్విజయం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రధాని మోదీ మూడో పర్యాయం బాధ్యతలు చేపట్టాక ఏపీలో మూడో పర్యటన ఇది. రాయలసీమ ముఖద్వారం కర్నూలులో తొలి జీఎస్టీ 2.0 అవగాహన సభ కావడం, ప్రధాని మోదీ వస్తుండడంతో జిల్లా యంత్రాంగానికి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా మారింది. ఏర్పాట్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు కర్నూలు, నంద్యాల జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సభను సక్సెస్ చేయడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. భద్రతా ఏర్పాట్లపై అడిషనల్ డీజీ మధుసూదన్‌రెడ్డి, రాయలసీమ పోలీస్ ఉన్నతాధికారులతో సమీక్షించారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ క్షేత్రస్థాయిలో, రోడ్లు భవ నాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. బుధవారం ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లలో మంత్రులు, అధికారులు నిమగ్నమయ్యారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి టీజీ భరత్

ఎవరి పనుల్లో వారు బిజీ!

ప్రధాని మోదీ పర్యటనను విజయవంతం చేయడంలో కలెక్టర్ మొదలు సామాన్య కార్యకర్త వరకు ఎవరికి వారే బిజీగా ఉన్నారు. నన్నూరు టోల్ ప్లాజా దగ్గర రాగమయూరి వెంచర్‌లో సభా ప్రాంగణం, హెలిప్యాడ్, ఉమ్మడి కర్నూలు, నంద్యాల సహా రాయలసీమ జిల్లాల నుంచి తరలివచ్చే ప్రజల వాహనాలు, వీవీఐపీలు, వీఐపీల వాహనాల నిలిపేందుకు 12 పార్కింగ్ స్థలాలు అభివృద్ధి చేస్తున్నారు. జాతీయ రహదారి నుంచి సభా ప్రాంగణం వరకు ప్రధాన రహదారి, డైవర్షన్ రోడ్లను బీటీ రోడ్లుగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

మిగతా 6వ పేజీలో

వచ్చేనెల 12న ఆర్‌యూ 4వ స్నాతకోత్సవం

- హాజరు కానున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

కర్నూలు అర్బన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ(ఆర్‌యూ)లో 4వ స్నాతకోత్సవం నవంబరు 12న నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్‌బోయ విజయకుమార్ నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ హాజరు అవుతారని ఆయన పేర్కొన్నారు. 2021-22, 2022-23, 2023-24, 2024-25 విద్యా సంవత్సరాల్లో యూజీ, పీజీ, బీఈడీ. బీపీఈడీ, ఎల్ఎల్‌బీ, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు పూర్తి చేసుకొని ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు పట్టాలు పొందొచ్చని ఆయన సూచించారు. ఇప్పటికే రెండు సార్లు స్నాతకోత్సవానికి నోటిఫికేషన్ విడుదల చేయడంతో విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారని వెల్లడించారు. యూజీ 9,404, పీజీ, ఇతర ప్రొఫెషనల్ కోర్సుల్లో 420, పీహెచ్‌డీ 148 మంది విద్యార్థులు దరఖాస్తు చేశారని, 70 మందికి గోల్డ్ మెడల్స్ ప్రదానం చేస్తారని వివరించారు.

నకిలీ మద్యంపై నిఘా పెట్టండి

- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి



సీఐలతో సమీక్షిస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి

కర్నూలు అర్బన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యంపై అధికారులు ప్రత్యేక నిఘా పెట్టాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి ఆదేశించారు. బుధవారం తన కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్ వి. హనుమంతరావుతో కలిసి ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల సీఐలతో నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా మొలకలచెరువు నకిలీ మద్యం నేపథ్యంలో జిల్లాలో ముమ్మర తనిఖీలు చేయాలని అన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాత కేసుల్లో నిందితులను బైండోవర్లు చేసి, వారి ప్రస్తుత కార్యకలాపాలపై దృష్టి పెట్టాలన్నారు. పొరుగు రాష్ట్రాల మద్యం జిల్లాలోకి ప్రవేశించకుండా నిరంతరం దాడులు కొనసాగించాలని ఆదేశించారు. సారా తయారీని మానేసిన వారికి ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపించాలన్నారు. ఈ సమీక్షలో సూపరింటెండెంట్లు మచ్చా సుధీర్ బాబు, అసిస్టెంట్ సూపరింటెండెంట్లు డి.రామకృష్ణారెడ్డి, రాజశేఖరగౌడ్ పాల్గొన్నారు.

యాపదిన్నెలో హైకోర్టు న్యాయమూర్తి


హైకోర్టు జడ్జి జస్టిస్ శ్రీనివాసరెడ్డిని కలిసిన న్యాయవాదులు

డోన్ రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): డోన్ మండలంలోని స్వగ్రామమైన యాపదిన్నెకు హైకోర్టు జడ్జి జస్టిస్ శ్రీనివాసరెడ్డి బుధవారం వచ్చారు. ఆయనను డోన్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్ నాయుడు, న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమాల, శాలువాతో సన్మానించారు.

శ్రీమఠంలో కార్తీక మాస దీపోత్సవం ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో కార్తీకమాస దీపోత్సవం ప్రారంభించారు. బుధవారం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్తీకదీపోత్సవానికి శ్రీకారం చుట్టారు. ఈనెల 7వ తేదీ నుంచి నవంబరు 5వ తేదీ వరకు శ్రీమఠం వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో రూ.210 చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్‌జోషి, సురేశ్ కోణాపూర్ తెలిపారు. నమోదు చేసుకున్న భక్తుల పేరు మీదుగా కార్తీక దీపోత్సవ సేవ, నవంబరు 5న కార్తీక పౌర్ణమి రోజున తుంగాహారతి నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా యోగీంద్ర కళామండపంలో మంత్రాలయం మహిమ అనే తెలుగు పౌరాణిక నాటకం భక్తులను ఆకట్టుకుంది.

కోర్టుకు హాజరుకాని సీఐ

- నాన్‌బెయిలబుల్ అరెస్టు వారెంటు జారీ
- తాలుకా పోలీసులపై ఆగ్రహం

కర్నూలు లీగల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలు తాలుకా పోలీస్‌స్టేషన్‌లో గతంలో నమోదైన ఒక పోక్సో కేసులో సాక్ష్యమివ్వడానికి అప్పటి సీఐ ఓబులేసు కోర్టుకు హాజరు కాలేదు. కర్నూలు పోక్సో కోర్టు న్యాయాధికారి ఈ.రాజేంద్రబాబు బుధవారం సీఐకు అరెస్టు వారెంటు జారీ చేశారు. 2022లో కర్నూలు తాలుకా పోలీస్ స్టేషన్‌లో 91/22 కేసు నమోదైంది. ఆ కేసులో దర్యాప్తు అధికారి అయిన సీఐ ఓబులేసు గతంలో కూడా కోర్టుకు హాజరు కాలేదు. ఈమేరకు కోర్టు ఆయనపై గతంలో బెయిలబుల్ వారెంట్లు జారీచేసింది. అయినా కూడా ఆయన కోర్టుకు రాకపోవడంతో ఆగ్రహించిన కోర్టు ఆయనపై నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీచేసింది. ఈకేసులో తాలుకా పోలీసులు కూడా సీఐకి సమన్లు జారీచేయడంలో నిర్లక్ష్యం వహించారని, కోర్టు ఆదేశాలపై నిర్లక్ష్యం వహించడం తగదని కోర్టు హెచ్చరించింది. ఇతర కేసుల్లో కూడా పోలీసులు సాక్షులకు సమన్లు అందించకుండా కోర్టు సమయాన్ని వృథా చేస్తున్నారని కోర్టు ఆగ్రహించింది. అవుకు పోలీస్ స్టేషన్‌లో నమోదైన వేరే కేసులో విచారణ కోసం షెడ్యూల్ నిర్ణయించినా కూడా పోలీసు సిబ్బంది సమన్లను అందజేయకపోవడంపై న్యాయాధికారి ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు సాక్షులకు సకాలంలో సమన్లను అందించకపోతే ఎస్పీకి రిపోర్టు చేయాల్సి వస్తుందని న్యాయాధికారి హెచ్చరించారు.

గంగమ్మ పైపైకి..

నెలరోజులుగా కురుస్తున్న వర్షాలు.. ఎల్లెల్సీకి నీటి విడుదలతో డివిజన్‌లో భూగర్భజలాలు పెరిగాయి. ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల మండలాల్లో గత వేసవిలో దాదాపు వెయ్యి బావులు, మూడు వేల బోర్లు అడుగంటి పోయాయి. ప్రస్తుతం కురిసిన వర్షాలతో గతంలో ఎండిన బావులు, బోర్లు నీటితో కళకళలాడుతున్నాయి. గంగమ్మ తల్లికి పైపైకి ఉబికి వస్తోంది. ఖరీఫ్‌లో సుమారు 20వేల ఎకరాల్లో పలు పంటలు సాగుచేశారు. పుష్కలంగా నీటిని చూసి రైతన్న ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.



- బావులు.. బోర్లలో పొంగి పొర్లుతున్న నీరు
- పెరుగుతున్న భూగర్భజలాలు
- రబీ సాగుకు ఇబ్బంది లేనట్టే

గోనెగండ్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేని వర్షాలతో గంగమ్మ పైపైకి ఉబికి వస్తోంది. బావులు, బోర్లలో భూగ ర్భజలాలు వృద్ధి చెందాయి. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తు న్నారు. గత ఏడాది వర్షాలు సకాలంలో కురియక పోవడంతో భూ గర్భజలాలు అడుగంటి పోయాయి. నెల రోజులుగా వర్షాలు కురు స్తున్నాయి. గతంలో ఎండిన బావుల్లో సైతం నీఱు ఊరుతుంది. ప్రస్తుతం ఎమ్మిగనూరు డివిజన్‌లో బావులు, బోర్ల కింద పత్తి, వేరుశనగ, ఉల్లి, కంది పంటలను 20వేల ఎకరాల్లో సాగుచేశారు. ఈ ఏడాది ముందస్తుగా అరకొర వర్షాలు కురియడంతో పంటలు సాగు చేశారు.



బోరు కింద సాగు చేసిన ఉల్లి పంట

బావులు, బోర్ల కిందే అధిక సాగు

ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల మండలాల్లో బావులు, బోర్ల కింద అధికంగా సాగు చేస్తారు. ఈ ఏడాది బావులు, బోర్లలో మొదట్లో నీరు అంతంతా మాత్రమే ఉండేది. ఇటీవల కురిసిన వర్షాలతో బావులు, బోర్లలో నీరు ఆశా జనకంగా ఊరుతుంది. రైతులు తమ పంటలకు నీటిని మళ్లించుకొని పంటలను పండించుకుంటున్నారు. వచ్చే వేసవిలో కూడా పంటలకు సాగునీటి ఇబ్బంది ఉండదని రైతులు చెబుతున్నారు.

దాదాపు వెయ్యి బావులు..

ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల మండలాల్లో గత వేసవిలో దాదాపు వెయ్యి బావులు, మూడు వేల బోర్లు అడుగంటి పోయాయి. ప్రస్తుతం కురిసిన వర్షాల తో గతంలో ఎండిన బావులు బోర్లు నీటితో కళకళలాడుతున్నాయి. ఈ ఏడాది గోనెగండ్ల మండలం హెచ్ కైరవాడి, వేముగోడు, చిన్ననేలటూరు, పెద్దమరివీడు, కులుమాల, అలువాల, గాజులదిన్నె, తిప్పనూరు, నందవరం మండలంలో ముగతి, నాగలదిన్నె, మిట్టసోమాపురం, గురుజాల, పూలచింత, ధర్మాపురం, హలహర్వి గ్రామాల రైతులు బావులు బోర్లు కింద పంటలు సాగు చేశారు.

ఎండిన బోరుకు నీరు వస్తుంది



వేసవిలో ఎండిన బోరుకు సైతం ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు, ఎల్లెల్సీ కాలువకు నీరు విడుదల కావడంతో నీరు అందుతుంది. ఆనీటితో మూడు ఎకరాల్లో పత్తిని సాగుచేశా. ప్రస్తుతం నీటి ఇబ్బంది లేదు. ● రాముడు, రైతు, గంజహళ్లి

నీరు పుష్కలంగా ఊరుతుంది



గత నెల నుంచి కురుస్తున్న వర్షాలతో భూమిలో నీటి శాతం పెరిగింది. దీంతో ప్రస్తుతం బావులు, బోర్లకు నీరు బాగా ఊరుతుంది. తన బోరుకు కూడా నీరు పుష్కలంగా అందుతుంది.

● రాయుడు, రైతు, గోనెగండ్ల

హంద్రీకి జలకళ

భారీవర్షాలతో హంద్రీ నదికి జలకళ సంతరించుకుంది. హంద్రీ పరిసర గ్రా మాలైన గాజులదిన్నె, హెచ్ కైరవాడి, వేముగోడు, పిల్లిగుండ్ల, తిప్పనూరు, బోదేపాడు, వీరంపల్లి, పుట్టపాశం, గ్రామాల రైతులు హంద్రీ నీటితో పంటలు పండించుకుంటున్నారు. దాదాపు 1000 ఎకరాల పైగానే హంద్రీ నీటితో పంటలు సాగు చేసుకుంటున్నారు. తాగునీటి సమస్య కూడా తీరింది.



హంద్రీనదిలోని నీటికోసం వేసిన బోరు

ప్రధాని పర్యటనకు వైద్య బృందాలు సిద్ధంగా ఉండాలి

- ఈ నెల 16 వరకు సెలవులు రద్దు
- కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు

కర్నూలు హస్పిటల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 16న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన దృష్ట్యా మెడికల్ టీమ్‌లు సిద్ధంగా ఉండాలని సంబంధిత హెచ్‌వోడీలను కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. బుధవారం సర్వజన వైద్యశాల ధన్వంతరీ కాన్ఫరెన్స్ హాలులో అన్ని విభాగాల హెచ్‌వోడీలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ నెల 16వ తేదీ వరకు అన్ని విభాగాలకు సంబంధించిన వైద్యులు ఆసుపత్రి సిబ్బంది సెలవులు రద్దు చేస్తున్నట్లు సూపరింటెండెంట్ తెలిపారు. అన్ని విభాగాల వైద్యులు సమయపాలన, పాటించి నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. క్యాజువాల్టీకి వచ్చే అత్యవసర కేసులు త్వరితగతిన వైద్యసేవలు అందించాలని హెచ్‌వోడీలను ఆదేశించారు.



మాట్లాడుతున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

ఎమర్జెన్సీ డిపార్టుమెంటుకు వచ్చే రోగులను త్వరగా అడ్మిషన్ అయ్యే విదంగా చూసుకుని సంబంధిత విభాగాలకు షిఫ్ట్ అయ్యేలా చూసుకోవాలన్నారు. ఆసుపత్రి భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని, శానిటేషన్ సిబ్బంది అన్ని విభాగాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీక్షలో ఇన్‌చార్జి సీఎస్ఆర్ఎంవో డా.వెంకటరమణ, వైస్ ప్రిన్సిపాల్ డా.హరిచరణ్, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, హెచ్‌వోడీలు డా.సి.శ్రీనివాసులు, డా.పి.శ్రీనివాసులు, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అవసరం

- నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి

డోన్ టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన విద్య అవసరమని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నాయని నంద్యాల పార్లమెంటు సభ్యురాలు, లోక్‌సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. బుధవారం నంద్యాల జిల్లా డోన్ పట్టణంలో నూతన కేంద్రీయ విద్యాలయ తరగతులను ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా శబరి మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యపట్ల ప్రత్యేక దృష్టి సారించారన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా విద్యకు అధిక నిధులు రాబట్టేందుకు కృషి చేస్తున్నారన్నారు. జిల్లా కేంద్రం



కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ బైరెడ్డి శబరి

నంద్యాలలో కూడా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు అధికంగా ఉండటంతో మరో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలని తాను కేంద్ర ప్రభుత్వాన్ని కోరగా మంజూరుకు అంగీకారం తెలిపినట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని, హిందీ చదవడం, రాయడం, నేర్చుకున్న విద్యార్థులు దేశంలో ఎక్కడైనా రాణించగలరని ఆమె అన్నారు. కేంద్రీయ విద్యాలయంలో చదువుకునే విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని, ఏ అవసరం వచ్చినా తనకు ఫోన్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డోన్ ఆర్డీవో కేవీ నరసింహులు, అర్బన్ సీఐ ఇర్ఫాన్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు మహర్దశ

- నంద్యాల జిల్లాకు రూ.73.10 కోట్లు మంజూరు
- మరమ్మతులు, నిర్మాణాలకు నిధులు
- పనుల కోసం త్వరలోనే టెండర్లు



నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్లకు మహర్దశ పట్టనుంది. రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ హైవేలు, మేజర్ డిస్ట్రిక్ రోడ్ల మరమ్మతులు, నిర్మాణాలకు మంజూరుచేసిన నిధుల్లో జిల్లాలో 23పనులకుగాను రూ.73.10కోట్లు కేటాయించింది. రాష్ట్ర వ్యాప్తంగా స్టేట్ హైవేలు 108పనులకుగాను రూ.400కోట్లు ఎండీఆర్ కింద 166పనులకు గాను రూ.600కోట్లు మంజూరు చేసింది. ఈమేరకు స్పెషల్ చీఫ్ సెక్రెటరీ కృష్ణబాబు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.

మంజూరైన నిధులు..

బనగానపల్లె నియోజకవర్గంలో ప్యాపిలి, యాగంటి, బనగానపల్లె రోడ్డుకు రూ.3.20కోట్లు, కోవెలకుంట్ల-బనగాన పల్లె రోడ్డుకు రూ.1.50కోట్లు, కాల్వ-బేతంచెర్ల-బనగానపల్లె రోడ్డుకు రూ.1.60కోట్లు, కాల్వ, బేతంచెర్ల, బనగానపల్లె రోడ్డుకు రూ.7.50కోట్లు మంజూరయ్యాయి.

కోవెలకుంట్ల-బనగానపల్లె రోడ్డుకు రూ.6కోట్లు, ప్యాపిలి, యాగంటి, బనగానపల్లె రోడ్డుకు రూ.5కోట్లు, పాణ్యం-బనగానపల్లె రోడ్డుకు రూ.50లక్షలు, కాల్వ, బేతంచెర్ల, బనగానపల్లెరోడ్డుకు రూ.1కోటి మంజూరు చేసింది.

- నంద్యాల-ఆత్మకూరు రోడ్డుకు రూ.2.50కోట్లు, నంద్యాల-మహానంది రోడ్డుకి రూ.2కోట్లు, గిద్దలూరు-సుంకేసుల రోడ్డు, అవుకు-తాడిపత్రి రోడ్డు, సింగనపల్లె, బెలూం వయా చనుగొండ్ల రోడ్డు 6.20కిలోమీటర్లకు రూ.3.70కోట్లు.
- నంద్యాల-పులిమద్ది రోడ్డు 9.90కిమీకి గాను రూ.4.35కోట్లు, అవుకు-తాడిపత్రి రోడ్డు 5.00కి.మీకి గాను రూ.2.50కోట్లు, అవుకు-తాడిపత్రి రోడ్డు 8.00కిమీకి గాను రూ.4కోట్లు, అవుకు-తాడిపత్రి రోడ్డు 2.20కి.మీకి రూ.1.90కోట్లు.
- నందవరం-టంగుటూరు, పీటీజీరోడ్డు టు కేటీ రోడ్డు వయా మిట్టపల్లె 3.50కి.మీకి రూ.3కోట్లు, కేజే రోడ్డు-బీఆర్‌జే రోడ్డు వయా గుళ్లదుర్తికి గాను రూ.3.50కోట్లు, కేజే రోడ్డు టు పొట్టిపాడుకి రూ.2కోట్లు, పేరుసోముల, పెద్దవెంతుర్ల, ఇటిక్యాల, ఉమ్మాయిపల్లె రోడ్డుకిగాను రూ.2.30కోట్లు.
- శిరివెళ్ల నుంచి రుద్రవరం రోడ్డు 2.20కి.మీకి రూ.1.75కోట్లు, శిరివెళ్ల మెట్ట నుంచి గోస్పాడు రోడ్డు 10.00కిమీకి రూ.5.80కోట్లు, వెలుగోడు, గార్గేయపురం 2.50కిమీకిగాను రూ.4.50కోట్లు, బైపాస్ రోడ్డు టు ధర్మవరం గ్రామానికి 1.60కిమీకిగాను రూ.3కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులకు త్వరలో టెండర్లు ఆహ్వానించనున్నారు.

కర్నూలు జిల్లాకు రూ.37.10 కోట్లు మంజూరు

కర్నూలు అర్బన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రాష్ట్ర, జిల్లా రహదారులకు రూ.37.10 కోట్లు మంజూరు చేస్తూ ఆర్ అండ్ బీ ప్రిన్సిపల్ సెక్రటరీ టి. క్రిష్ణబాబు జీవో జారీ చేశారు. ఈ మేరకు జిల్లాలో రాష్ట్ర రహదార్ల (ఎస్‌హెచ్)కు రూ.18 కోట్లు, జిల్లా ప్రధాన రహదార్ల (ఎండీఆర్)కు రూ.19.10 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర రహదారుల్లోని కర్నూలు - బళ్లారి రోడ్డు 27 కి.మీకు రూ. 8 కోట్లు, సి. బెళగల్, గూడూరు మీదుగా ఎమ్మిగనూరు రోడ్డుకు 7 కి.మీలకు రూ. 5 కోట్లు, గుత్తి, పత్తికొండ, ఆదోని రోడ్డుకు 9 కి.మీలకు రూ. 5 కోట్లు కేటాయించారు. అలాగే జిల్లా ప్రధాన రహదారులైన మదిర- కాత్రిక 3.0 కిమీ, నదిచాగి- బాపురం రోడ్డు 2 కిమీ, మా ధవరం - ఎం తాండ 6 కిమీ రోడ్లకు రూ. 3.60 కోట్లు, కరివేముల నుంచి ఆరేకల్ రోడ్డు 12.30 కి.మీ రూ.3.5 కోట్లు, ఎమ్మిగనూరు నుంచి మాలపల్లి మీదుగా కోసిగి వరకు 11 కి.మీ రూ.5 కోట్లు, ధనాపురం - హొళగుంద వరకు 12.80 కి.మీకు రూ.7 కోట్లు కేటాయించారు.

ప్రహ్లాద వరదుడికి ప్రత్యేక పూజలు

రెండో రోజు వైభవంగా పవిత్రోత్సవం

ఆళ్లగడ్డ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన దిగువ అహోబిలంలో ప్రహ్లాద వరద, శ్రీదేవిభూదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం రెండో రోజు పవిత్రోత్సవం వైభవంగా నిర్వహించారు. 46వ పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహా దేశికన్ స్వామి ఆధ్వర్యంలో లక్ష్మీనరసింహస్వామి, శ్రీదేవి భూదేవి అమ్మవార్లు కు ఆలయ ప్రధాన అర్చకులు కీడాంబి వేణుగోపాల్‌స్వామి పర్యవేక్షణలో పవిత్ర మాలలతో అలం కరించి హోమం పూర్ణాహుతి నిర్వహించారు. ఈపూజా కార్యక్రమాలకు భక్తులు అధిక సం ఖ్యలో తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు.



పూజలు చేస్తున్న పీఠాధిపతి

రాఘవేంద్రుడి సన్నిధిలో కర్ణాటక హైకోర్టు జడ్జి

- ఘనస్వాగతం పలికిన మఠం అధికారులు

మంత్రాలయం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ సుధా బుధవారం రాత్రి రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. మహా ముఖ ద్వారం వద్ద మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, సురేష్ కోనాపూర్, ఐపీ నరసింహామూర్తి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు జ్ఞాపిక, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదమిచ్చి ఆశీర్వదించారు. కార్తీక దీపోత్సవంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతపురాణిక్, ఎస్ఐ శివాంజిల్, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, పవన్‌ఆచార్, వ్యాసరాజార్, జయతీర్థ ఆచార్, రమణ, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు



సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లు

(5వ పేజీ తరువాయి)

ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్ల తీరుపై ఆంధ్రజ్యోతి క్షేత్రస్థాయిలో పరిశీలించింది. రెవెన్యూ, రోడ్లు భవనాలు, పంచాయతీ రాజ్, విద్యుత్, డ్వామా, డీఆర్‌డీఏ-వెలుగు, జలవనరులు.. ఇలా వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారి నుంచి కింద స్థాయి సిబ్బంది, కార్మికుల వరకు తమకు కేటాయించిన పనుల్లో నిమగ్నమై బిజీగా కనిపించారు. ముఖ్యంగా సభా ప్రాంగణం ఏర్పాట్లు ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పర్యవేక్షణలో వేగంగా జరుగుతున్నాయి. విద్యుత్ శాఖ ఇంజనీర్లు, సిబ్బంది స్తంభాలు, విద్యుత్ తీగలు, పాటు ఫ్లడ్‌లైట్లు ఏర్పాట్లు చేస్తున్నారు. 3-4 లక్షలకు పైగా ప్రజలు, పెద్ద సంఖ్యలో ప్రముఖులు హాజరయ్యే అవకాశం ఉంది. దీంతో సభా ప్రాంగణం అందంగా తీర్చేదిద్దేందుకు వందలాది ఎక్స్‌కవేటర్లు, టిప్పర్లు పని చేస్తున్నాయి. పనులు పర్యవేక్షణకు జిల్లా స్థాయి అధికారులకు బాధ్యతలు అప్పగించారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న కర్నూలు కలెక్టర్, అధికారులు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం చంద్రబాబు సమీక్ష

రాయలసీమ ముఖద్వారం కర్నూలు, దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీశైలంలో ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కర్నూలు, నంద్యాల జిల్లాల కలెక్టర్లు డాక్టర్ ఎ.సిరి, రాజకుమారి, ఎస్పీలు విక్రాంత్ పాటిల్, సునీల్ షేరాన్లులతో సమీక్ష నిర్వహించారు. ప్రధాని పర్యటనలో తీసుకోవాల్సిన భద్రతా ఏర్పాట్లు, పర్యటన రోడ్ మ్యాప్‌పై చంద్రబాబు సూచనలు చేశారు. ప్రధాని పర్యటనకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లు, కార్యక్రమాల నిర్వహణ, సభా ప్రాంగణం, హెలిప్యాడ్, పార్కింగ్ నిర్వహణ వంటి వివరాలను ముఖ్యమంత్రికి వివరించారు. ప్రధాని పర్యటనలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎన్డీఏ పార్టీల జాతీయ, రాష్ట్ర ముఖ్య నేతలు హాజరయ్యే అవకాశం ఉంది. ఏ లోటు లేకుండా ప్రధాని పర్యటనను సక్సెస్ చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై సీఎం చంద్రబాబు కలెక్టర్లు, ఎస్పీలకు వివరించారు. అంతకు ముందు కర్నూలు కలెక్టర్ డాక్టర్ అట్టాడ సిరి రాగమయూరి గ్రీన్ హిల్స్ వద్ద సభా ప్రాంగణం, హెలిప్యాడ్, పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. ప్రధాని పర్యటన సక్సెస్ చేయడానికి తీసుకో వాల్సిన చర్యలపై పీఎం ప్రోగ్రామ్స్ స్పెషల్ ఆఫీసర్ వీరపాం డియాన్, సీఎం ప్రోగాం కో-ఆర్డీనేటర్ మంతెన సత్య నారాయణతో చర్చించారు. వివిధ బాధ్యతలు చూస్తున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భర ద్వాజ్, ఆర్ అండ్ బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ శాంతికళ, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఏవో సింధూ సుబ్రహ్మణ్యం, డీపీవో భాస్కర్, ఐసీడీఎస్ పీడీ విజయ సహా వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు.

పక్కా ప్రణాళికతో భద్రతా ఏర్పాట్లు

ప్రధాని మోదీ పర్యటన భద్రతా ఏర్పాట్లపై అడిషనల్ డీజీ మధుసూదన్‌రెడ్డి జిల్లా పోలీస్ అధికారులతో సమీక్షించారు. ఐజీ శ్రీకాంత్, డీఐజీలు కోయ ప్రవీణ్, సెంథిల్ కుమార్, సత్యయేసు బాబు, ఫక్కీరప్ప కాగినెల్లిలతో కలసి ఓర్వకల్లు విమానాశ్రయం సమీపంలోని ఏరోవన్ ఫంక్షన్ హాల్‌లో పోలీస్ అధికారులతో ప్రధాని మోదీ పర్యటన భద్రతా ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. భద్రతా, రోడ్ల డైవర్షన్, నిఘాపై చర్చించారు. గూగుల్ మ్యాప్ ద్వారా సమీక్షించిన ఆయన డ్రోన్ కెమరాలతో భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు. పోలీస్ అధికారులతో కలిసి హెలిప్యాడ్, సభా ప్రాంగణం, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. కానిస్టేబుల్ స్థాయి నుంచి ఆపై అధికారులను మాత్రమే భద్రత, బందోబస్తు విధుల్లో నియమించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు సూచనలు చేశారు. నిత్యం అధికారులు పర్యవేక్షణ (మానిటరింగ్) చేయాలని సూచనలు చేశారు. కర్నూలు, నంద్యాల సహా అనంతపురం, కడప జిల్లాల నుంచి ఏఏ రూట్లలో వాహనాలు రానున్నాయి. ఆ వాహనాలు ఏ పార్కింగ్‌కు ఎలా మళ్లించాలో క్షేత్రస్థాయిలో అడిషనల్ డీజీ క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎస్పీలు విక్రాంత్ పాటిల్, షెల్కే నచికేత్, విశ్వనాథ్, దేవరాజ్, ధీరజ్ కునుబిల్లి, దీపికా పాటిల్, అడిషనల్ ఎస్పీలు హుసేన్‌పీరా, కృష్ణమోహన్, ట్రైనీ ఐపీఎస్‌లు, డీఎస్పీలు, ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచీ అధికారులు పాల్గొన్నారు.



భద్రతా ఏర్పాట్లపై సమీక్షిస్తున్న అడిషనల్ డీజీ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు



ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి టీజీ భరత్

ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లను పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ పరిశీలించారు. సభా ప్రాంగణం ఏర్పాట్లను ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే. హెలిప్యాడ్, పార్కింగ్ స్థలాలను తనిఖీ చేశారు. విద్యుత్, రోడ్లు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ప్రధాని మోదీ పర్యటనను కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని అన్నారు. మూడు లక్షల మందికి పైగా హాజరు అవుతారని తెలిపారు. ఏ ఒక్కరికీ ఏ చిన్న ఇబ్బంది రాకుండా పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని సూచించారు.

ఆటోను ఢీకొట్టిన కారు



బుక్కాపురం సమీపంలో బోల్తాపడ్డ ఆటో

- నలుగురికి తీవ్ర గాయాలు

మహానంది, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆటోను కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరు టీచర్లతో మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని బుక్కాపురం సమీపంలో చోటుచేసుకున్నట్లు ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. నంద్యాలకు చెందిన ఉమామహేశ్వరమ్మ, రాఘమేంద్రమ్మ మండలంలోని అబ్బీపురం ప్రభుత్వ పాఠశాలలో టీచర్లుగా పనిచేస్తున్నారు. బుధవారం విధులు ముగించుకొని తిరిగి ఆటోలో నంద్యాలకు వెళ్తుండగా మార్గమధ్యలో బుక్కాపురం సమీపంలో వీరు ప్రయాణిస్తున్న ఆటోను వెనుకవైపు నుంచి కారు ఢీకొంది. ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈఘటనలో ఇద్దరు టీచర్లతో పాటు పుట్టుపల్లికి చెందిన జయరాముడు, ఆటోడ్రైవర్ బాలస్వామి తీవ్రంగా గాయపడ్డారు. నలుగురిని చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు రంగంలోకి దిగి ప్రమాదానికి కారణమైన కారును వెంబడించి పట్టుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మోటారు సైకిల్ ఢీ.. ఉపాధ్యాయినికి తీవ్ర గాయాలు

పాణ్యం: స్థానిక విజయానికేతన్ పాఠశాల వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోడల్ పాఠశాల ఉపాధ్యాయిని తీవ్రంగా గాయపడినట్లు పాణ్యం ఎస్‌ఐ నరేంద్రకుమార్ రెడ్డి తెలిపారు. మోడల్ పాఠశాలలో సైన్స్ ఉపా ధ్యాయినిగా విధులు నిర్వహిస్తున్న ఇ. సౌజన్య పా ఠశాలకు భర్తతో పాటు వెళ్తూ తమ పిల్లలను విజయానికేతన్ పాఠశాలలో వదలి సుగాలిమెట్టకు మోటారు సైకిల్‌పై వెళ్తుండగా ఎదురుగా మరో మోటారు సైకిల్ అతి వేగంగా వచ్చి ఢీకొంది. సౌజన్య తలకు తీవ్ర గాయం కావడంతో వెంటనే శాంతిరాం ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా సౌజన్య మూడు నెలల క్రితం పులివెందుదల నుంచి పాణ్యంకు బదిలీపై వచ్చినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

విద్యార్థిని బలవన్మరణం

సంజామల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని కానాల గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన ఏరాశి దస్తగిరి కూతురు ఏరాశి శ్యామల (19) అవుకు పట్టణంలోని మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతోంది. బుధవారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకొని మృతి చెందింది. తండ్రి దస్తగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమణయ్య తెలిపారు. కాగా ఇదే గ్రామంలో హసేన్‌బీ అనే యువతి ఆత్మహత్యకు పాల్పడింది. కాగా మృతురాలి వివరాలు తెలియాల్సి ఉంది.

శ్రీశైలంలో కర్ణాటక వ్యక్తి మృతి

శ్రీశైలం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో గోశాల వద్ద కర్ణాటకకు చెందిన ప్రకాష్ గురవ్ (70) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులకు స్థానికులు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలికి చేరుకుని చనిపోయిన వ్యక్తి బంధువులకు సమాచారం అందించారు. కాగా ఆయన మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

దొంగ అరెస్టు

కర్నూలు క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలోని టిడ్కో గృహాల్లో చోరీలకు పాల్పడుతున్న నిందితున్ని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల మేరకు.. కర్నూలు చెందిన షేక్షావలి టిడ్కో ఇళ్లలో రూ.లక్ష విలువ గల అల్యూమినియం డోర్లు చోరీ చేసి విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితునిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

56 ద్విచక్ర వాహనాలు సీజ్

కర్నూలు క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో 56 ద్విచక్రవాహలను పోలీసులు సీజ్ చేశారు. కొద్ది కాలంగా పలు కేసుల్లో బైకులను గుర్తించి స్టేషన్‌కు తరలించారు. అయితే ఈ వాహనాలను తీసుకెళ్లేందుకు ఎవరూ రాకపోవడంతో కొద్ది కాలంగా పోలీస్ స్టేషన్‌లోనే ఉన్నాయి. ఇటీవల ఎస్పీ అన్ని స్టేషన్లలో ఏళ్లుగా ఉన్న బైకులను డిస్‌పోస్ చేయాలని ఆదేశాలు ఇవ్వడంతో నాలుగో పట్టణ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. కొద్దిరోజుల్లోనే వీటిని వేలం వేసేందుకు కేసులు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.


23 నుంచి నవ చండీ హోమం



అమ్మవారిని దర్శించుకుంటున్న నాగేంద్ర స్వామీజీ

కొత్తపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కొలనుభారతి పుణ్యక్షేత్రంలో ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు నవ చండీ హోమం నిర్వహించనున్నట్లు అరుణాచల అన్నపూర్ణ ఆశ్రమం పీఠాధిపతి శివానంద లహరి స్వామీజీ శిష్యుడు నాగేంద్ర స్వామి తెలిపారు. బుధవారం నాగేంద్రస్వామి సరస్వతి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పురోహితులు ఆయనకు అమ్మవారి చిత్రపటాన్ని, జ్ఞాపికను అందజేశారు. ఆయన వెంట శిష్య బృందం బోడపాటి ముని చక్రవర్తి, కొమ్ము శివరామకృష్ణ ఉన్నారు.

ఉపాధ్యాయులు మార్గదర్శకులు



అవార్డులు అందజేస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు దేశ భవిష్యత్తుకు మార్గదర్శకులని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్, ఎంపీ శబరి అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్‌కే ఫంక్షన్ హాల్లో ఏపీ ప్రైవేట్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఉత్తమ ప్రైవేట్ ఉపాధ్యాయులను సన్మానించారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. బెస్ట్ టీచర్స్ అవార్డు లోగోను ఆవిష్కరించారు. అసోసియేషన్ చైర్మన్, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, రాష్ట్ర జిల్లా అధ్యక్షులు తులసి విష్ణుప్రసాద్, బిజ్జం సుబ్బారెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండీ ఫిరోజ్ పాల్గొన్నారు.

పెద్దమ్మను దర్శించుకున్న టీహెచ్‌ఆర్‌సీ సభ్యురాలు

బనగానపల్లె, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టంగుటూరు పెద్దమ్మను తెలంగాణా మానవహక్కుల కమిషన్ సభ్యురాలు జస్టిస్ ప్రవీణ బుధవారం దర్శించుకున్నారు. ఆమెకు వీఆర్వో శివరామయ్య, ఆలయ కమిటీ సభ్యులు రామగంగిరెడ్డి, కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. ప్రవీణతో పాటు హైకోర్టు మాజీ న్యాయమూర్తి శేషశయనారెడ్డి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం వారు పెద్దమ్మతల్లి అన్నదాన సత్రంలో భోజనం చేశారు.

అభివృద్ధికి కృషి

- వర్గాలకు తావులేకుండా ఏకతాటిపై నడిపిస్తా
- వైసీపీ ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదు
- టీడీపీ ఆలూరు ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి



మాట్లాడుతున్న టీడీపీ ఆలూరు ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి

ఆలూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తానని టీడీపీ ఆలూరు ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అన్నారు. బుధవారం పట్టణంలోని ఇబ్రహీం ఫంక్షన్‌హాలులో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశానికి రాయలసీమ రీజనల్ కోఆర్డినేటర్ బీద రవిచంద్రయాదవ్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ బుజ్జమ్మ, డీసీఎం ఎస్ చైర్మన్ నాగేశ్వర్‌యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీలో వర్గాలకు తావు లేకుండా పార్టీని ఏకతాటిపైకి నడిపిస్తామన్నారు. రహదారులు, తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రతిపక్ష హోదా లేని వైసీపీ ఎమ్మెల్యే లు ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదన్నారు. ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ఉల్లి రైతులతో చేసిన యాక్షన్ ప్రజలకు తెలుసున్నారు. తనకు టీడీపీ ఇన్‌చార్జిగా నియమించిన సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌కు, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, రాయలసీమ రీజనల్ కోఆర్డినేటర్ బీద రవిచంద్రయాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్‌యార్డు చైర్మన్ బిల్లేకల్ వెంకటేష్, ఆలూరు పరిశీలకులు గంజి నాగరాజు, ఆలూరు బ్రాంచ్ కెనాల్ డీసీ అధ్యక్షులు నగరడోణ కిష్టప్ప, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ కురువ జయరాం, మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు, మండల కన్వీనర్లు అశోక్, వల్లి, విజయ్, పరమరెడ్డి, సుధాకర్, తిప్పయ్య, సీనియర్ నాయకులు వెంకటేష్‌చౌదరి, విష్ణువర్ధన్‌రెడ్డి, ఎల్లార్తి మల్లి, శివప్రకాష్, రఘుబాబు, కటారి కొండ శీనప్ప, కృష్ణయాదవ్, ఉచ్చీరప్ప, బెలగంటి హనుమప్ప, కృష్ణంనాయుడు, వీరసేన రెడ్డి, నరసప్ప, సంజన్న, మేకల రంగనాథ్, సతీష్, బెంగళూరు కిషోర్ పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న నాయకులు

గ్రీన్‌కో ప్రాజెక్టుకు 170.14 ఎకరాల అప్పగింత

- ఎకరాకు రూ.6.25లక్షల చొప్పున చెల్లించాలి
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

నంద్యాల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పాణ్యం నియోజకవర్గ పరిధిలోని పిన్నాపురంలో గ్రీన్‌కో ప్రాజెక్టుకు 170.14 ఎకరాల భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల అమరావతిలో సీఎం చంద్రబాబు సమక్షంలో జరిగిన కేబినేట్ సమావేశంలోనూ ఇదేఅంశంపై ఆమోదం పొందిన విషయం తెలిసిందే. సదరు ప్రాజెక్టుకు కేటాయించిన 170.14ఎకరాల ప్రభుత్వ భూమికి ఒక్కొక్క ఎకరాకు రూ.6.25లక్షల చొప్పున అప్పగించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గతంలో 2020లో జూన్13న ఎకరా రూ.5లక్షల చొప్పున నిర్ణయించగా.. వివిధ కారణాలతో సదరు ఫైల్ అప్పట్లో ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం రాకతో.. కలెక్టర్ రాజకుమారి ఫైల్‌ను మరోమారు పునఃపరిశీలన చేసి ఎకరాకు రూ. 6.25 లక్షల చొప్పున సదరు సంస్థ ప్రభుత్వానికి అందజేయాలని నివేదిక పంపారు. కేబినేట్ సమావేశంలో ఆమోదం పొందాక తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సదరు భూమిని మొదట నెడ్‌క్యాప్‌కు అప్పగించి.. ఆతర్వాత సంస్థకు అప్పగించి తర్వాత నగదును ప్రభుత్వానికి సదరు సంస్థ చెల్లించనుంది.

హైకోర్టులో ఎంపీపీ రిట్ పిటిషన్

- అధికారులు సమాధానమివ్వాలని కోర్టు ఆదేశాలు

ఆదోని రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎంపీటీసీలు పెట్టిన అవిశ్వాస తీర్మానం చెల్లదని, ఫోర్జరీ సంతకాలు పెట్టారంటూ ఆదోని ఎంపీపీ దానమ్మ హైకోర్టులో రిట్ పిటిషన్ వేసింది. దీంతో జిల్లా నుంచి మండల స్థాయి అధికారులు సమాధానం చెప్పాలంటూ హైకోర్టు ఆదేశించింది. మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి సన్నిహితుడిగా ఉన్న మాజీ ఎంపీపీ బడాయి పంపాపతి భార్య బడాయి దానమ్మను ఆదోని ఎంపీపీగా ఎన్నుకున్నారు. ఆమె ప్రస్తుతం వైసీపీని వీడి ఎమ్మెల్యే పార్థసారథి సమక్షంలో బీజేపీలో చేరింది. దీంతో ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ ఎంపీటీ సీలు నిర్ణయించు కున్నారు. గత నెల 26వ తేదీన ఫారం-3ని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వారు ఇచ్చారు. ఈనెల 22న అవిశ్వాస తీర్మాన సమావేశాన్ని నిర్వహించాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు.



ఎంపీపీ దానమ్మ

అనర్హత వేటు పడినా..

2021 సెప్టెంబరు 24న బడాయి దానమ్మ(వైసీపీ) ఎంపీపీగా ప్రమాణ స్వీకారం చేశారు. నాలుగు నెలలకు ఓసారి జరిగే మండల సర్వసభ్య సమావేశానికి 2/3 ఎంపీటీసీలు హాజరు కావాలి. అలా రాని పక్షంలో సమావేశాన్ని వాయిదా వేయాలి. వరుసగా మూడుసార్లు సమావేశానికి ఎంపీటీసీలు హాజరుకాకపోతే వారిపై అధికా రులు అనర్హత వేటు వేస్తారు. అలా అనర్హత వేటుకు గురైన వారిని సెక్షన్ 21 ప్రకారం పునర్ధరించవచ్చు. ఇందులో భాగంగానే 2022-23లో మూడు మండల సమావే శాలకు ఆరుగురు ఎంపీటీసీలు హాజరు కాలేదు. అప్పటి అధికా రులు వారిపై అనర్హత వేటు వేయకుండా సంజాయిషీ కోరుతూ, నోటీసులిచ్చారు. సంబంధిత ఎంపీటీసీలు నోటీసులకు సమాధానం ఇవ్వడంతో తరువాత సమావేశానికి ఆహ్వానించారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న ఎంపీపీ బడాయి దానమ్మ కోర్టుమెట్లెక్కింది.

ఫోర్జరీ సంతకాలు పెట్టారు

తనపై పెట్టిన అవిశ్వాస తీర్మానంలో ఆరుగురు ఎంపీటీసీలు ఫోర్జరీ సంతకాలు పెట్టారని, ఇది చెల్లుబాటు కాదని, తీర్మానాన్ని రద్దు చేయాలని ఎంపీపీ దానమ్మ ఈనెల 6న హైకోర్టులో రిట్ పిటిషన్ వేసింది. ఈ పిటిషన్‌కు సమాధానం చెప్పాలంటూ హైకోర్టు కర్నూలు కలెక్టర్, ఆదోని సబ్‌కలెక్టర్, డీపీవో, డీఎల్‌పీవో, ఎంపీడీవోలను ఆదేశించింది. కోర్టు ఆదేశాలతో మండల కార్యాలయ అధికారులు సమాధానం ఇవ్వడానికి సిద్ధమవుతున్నారు.

కోర్టు నోటీసులు అందాయి

ఎంపీపీ దానమ్మ హైకోర్టులో వేసిన రిట్ పిటిషన్ నోటీసులు కోర్టు ద్వారా బుధవారం తమకు అందాయని ఎంపీడీవో జనార్దన్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కోర్టు నోటీసులకు సమాధానమిస్తామన్నారు.

10న డిప్లొమా ఇన్ పారా మెడికల్ కోర్సులకు కౌన్సెలింగ్

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీలో డిప్లొమా ఇన్ అలైడ్, హెల్త్ కేర్ సర్వీసెస్ డిప్లమా ఇన్ పారా మెడికల్ కోర్సులకు 2025-26కు గాను అడ్మిషన్ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 10వ తేదీ ఉదయం 10 గంటలకు కాలేజీలోని ఆడిటోరియంలో కౌన్సెలింగ్ ఉంటుందని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు. ఇంటర్ బైపీసీ విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని, ఇంటర్ ఒరిజినల్ మార్కుల మెమో లేని యెడల వారి దరఖాస్తును తిరస్కరిస్తారని పేర్కొన్నారు.

కల్తీ మద్యంతో చెలగాటం తగదు: వైసీపీ



కర్నూలు ఎక్సైజ్ కార్యాలయం వద్ద బైఠాయించిన వైసీపీ నాయకురాళ్లు

కర్నూలు అర్బన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో కల్తీ మద్యం అమాయకుల ప్రాణాలను బలి గొంటోందని వైసీపీ మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ విజయమనోహరి ధ్వజమెత్తారు. బుధవారం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం ఎదుట వైసీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ వి.హనుమంతరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కల్తీ మద్యంతో పాటు బెల్టుషాపులతో పేదల కుటుంబాలను చంద్రబాబు ప్రభుత్వం చిన్నాభిన్నం చేస్తోందన్నారు.

జీతాల కోసం ఎదురుచూపులు



ఆవేదన వ్యక్తం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

- 200 మందికి నెలకు రూ.24 లక్షలు
- ఆరు నెలలకు రూ.1.44 కోట్లు పెండింగ్
- ఇబ్బందులు పడుతున్న కార్మికులు

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని పరిసరాల శుభ్రత గురించి తెల్లవారుజామున నుంచే ఆలోచించే వారు పారిశుధ్య కార్మికులు. మిగతా ప్రజల జీవన విధానం ఎట్లా ఉన్న కార్మికుల జీవన విధానం భిన్నంగా ఉంటుంది. మన ఇంట్లో పొరక పట్టుకుని శుభ్రం చేసేందుకే నామోషి పడే రోజుల్లో కూడా కార్మికులు ఎటువంటి జంకు బొంకు లేకుండా నగరంలోని ప్రతి చోట కాలువలను శుభ్రం చేస్తూ నగరాన్ని సుందరవనంగా తీర్చిదిద్దేందుకు తమవంతు పాత్ర పోషిస్తున్నారు. అయితే ఆరు నెలలుగా వారికి జీతాలు అందడం లేదు. ఒక్కో కార్మికునికి వచ్చేది కేవలం రూ.12 వేలు మాత్రమే. అది కూడ ఇవ్వకపోవడంతో కార్మికులు గత ఆరు నెలలుగా ఇంట్లో పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

14 డివిజన్లలో 200 మంది కార్మికులు

నగర పాలక సంస్థ పరిధిలో 14 డివిజన్లలో కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు 200 మంది ఉన్నారు. నగర పాలక పరిధిలోని కాలువల్లో పూడికతీత తీయడం కోసమే వీరిని ఏర్పాటు చేసుకున్నారు. కాలువలను శుభ్రం చేస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న కార్మికులకు జీతాలు ఇవ్వడం కొరవడింది. ఇంటి అద్దెలు, పిల్లల ఫీజులు, సంసారం ఎలా నెట్టుకురావాలో అర్థం కావడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కొక్కరికి రూ.10 వేల వేతనంతో పాటు రూ.2 వేలు అలవెన్సు అందాల్సి ఉంది. నెలకు రూ.24.00 లక్షలు, ఆరు నెలలకు రూ.1,44,45,000 చెల్లించాల్సి ఉంది. ప్రారంభంలో ప్రతి నెల తీసుకునేవారని, రాను రాను రెండు నెలలకు ఒక్కసారి వస్తున్నట్లు కార్మికులు చెబుతున్నారు.

ప్రభుత్వానికి నివేదిక పంపించాం

కార్మికులకు రావాల్సిన జీతాలకు సంబంధించి ప్రభుత్వానికి నివేదికలు పంపించాం. ప్రస్తుతం అకౌంట్స్ విభాగంలో నుంచి ప్రభుత్వానికి వెళ్లినట్లు తెలిసింది. ప్రభుత్వం నుంచి నిధులు ఎప్పుడు మంజూరు అయితే అప్పుడే కార్మికులకు అందజేస్తాం. **- డా.ఎస్‌బీ విష్ణుమూర్తి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్**

జీతాలు సక్రమంగా ఇవ్వాలి

ఆరు నెలలుగా జీతాలు రాకపోవడంతో ఇంటి అద్దెలు...పిల్లలకు పాఠశాల ఫీజులు చెల్లించలేని దిక్కు తోచని స్థితిలో ఉన్నాము. సెలవులు ఇవ్వరు. ప్రతి రోజు పని చేయాల్సిందేనని చెబుతున్నారు. జ్వరం వచ్చి ఒక్కరోజు పనికి రాకుంటే జీతం కట్‌చేస్తున్నారు. అలాంటప్పుడు జీతాలు పెండింగ్ లేకుండా ఇస్తే బాగుంటుంది. **- సరోజ, కార్మికురాలు**



బస్సు డ్రైవర్‌పై ప్రయాణికుడి దాడి

- డ్రైవర్‌కు తీవ్ర గాయాలు
- డిపో వద్ద డ్రైవర్ల నిరసన



ధర్నా చేస్తున్న ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లు



బస్సులు లేక ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

ఆళ్లగడ్డ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): అద్దె బస్సు డ్రైవర్‌పై ఓ ప్రయాణికుడు దాడి చేయడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆళ్లగడ్డ ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న ప్రైవేటు బస్సుల డ్రైవర్లు బుధవారం విధులను బహిష్కరించి ధర్నా నిర్వహించారు. వివరాలు ఇలా ఉన్నాయి... ఆళ్లగడ్డ డిపో పరిధిలో నడుస్తున్న ఆర్టీసీ హయ్యర్ బస్సును దువ్వూరు వద్ద ఆపలేదని ఓ ప్రయాణికుడు డ్రైవర్ మహమ్మద్‌పై దాడి చేశాడు. డ్రైవర్ తలకు బలమైన గాయం కావడంతో ప్రైవేటు బస్సుల డ్రైవర్లు బస్సులను డిపో ఆవరణంలో ఉంచి సీఐటీయూ కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఆళ్లగడ్డ డిపోకు చెందిన బస్సు డ్రైవర్ మహమ్మద్‌పై దాడి చేసిన వ్యక్తిపై నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దాడికి నిరసనగా నంద్యాల, కోవెలకుంట్ల, ఆత్మకూరు, నందికొట్కూరు, మైదుకూరు, రాజంపేట, జమ్మలమడుగు డిపోలలోని ప్రైవేటు బస్సుల డ్రైవర్లు పాల్గొన్నట్లు సంఘం నాయకులు తెలిపారు. ఒక్కసారిగా ప్రైవేటు బస్సులు నిలిచి పోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

డ్రైవర్‌పై దాడిని ఖండించిన ఆర్‌ఎం

ఆళ్లగడ్డ- మైదుకూరు హయ్యర్ బస్సు డ్రైవర్ మహమ్మద్ పై జరిగిన దాడిని నంద్యాల రీజనల్ మేనేజర్ రజియా సుల్తానా తీవ్రంగా ఖండించారు. విషయం తెలిసిన వెంటనే బుధవారం ఆమె ఆళ్లగడ్డ ఆర్టీసీ డిపోకు తరలి వచ్చారు. దాడి ఘటనపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసు కున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ సంఘటనతో జిల్లా వ్యాప్తంగా హయ్యర్ బస్సుల డ్రైవర్లు ధర్నాలో పాల్గొన్నారన్నారు. దాడి విషయాన్ని ఆళ్లగడ్డ డిఎస్పీ ప్రమోద్ దృష్టికి తీసుకెళ్లామని బాధిత డ్రైవర్‌కు న్యాయం చేస్తామని ఆమె హామీ ఇచ్చారు.

రోడ్డుపై మురుగు



మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో డ్రైనేజీ లేకపోవడంతో రహదారిపై మురుగు పారుతోంది. గృహాల వ్యర్థపు నీరు రోడ్డుపైకి రావడంతో దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. లారీ విజయ్ ఇంటి నుంచి గ్రామపంచాయితీ కార్యాలయం వరకు ఇంతే. అధికారులు స్పందించి డ్రైనేజీ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. - కోడుమూరు రూరల్



నగరంలోని సంతోష్‌నగర్ సమీపంలోని ఆటోనగర్ ఎన్‌హెచ్-44 సర్వీసు రోడ్డుపై మురుగునీరు నిలిచింది. మ్యాన్‌హోల్ నిండిపోవడంతో డ్రైనేజీ రోడ్డుపైకి వస్తోందని 6 నెలలుగా ఇబ్బంది పడుతున్నామని వాహదారులు అంటున్నారు. రెండు రోజుల క్రితం బైక్ అదుపు తప్పి ఓ వాహనదారుడు కిందపడ్డాడు. అధికారులు స్పందించి, డ్రైనేజీ రోడ్డుపైకి రాకుండా సరి చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు. - కర్నూలు హాస్పిటల్

రైతు సంక్షేమమే ధ్యేయం



ఉల్లి రైతుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దస్తగిరి

కోడుమూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. బుధవారం వ్యవసాయ కార్యాలయం ఆవరణలో సబ్సిడీ శనగ విత్తనాలు పంపిణీని ప్రారంభించారు. క్వింటం ధర రూ.7,800 లు కాగా, 25శాతం సబ్సిడీ పోగా రైతులు రూ.5,850లు చెల్లించాలన్నారు. అనంతరం కోడుమూరు సమీపంలోని ఉల్లి పంటను పరిశీలించి రైతుల కష్టాలను తెలుసుకున్నారు. ఉల్లి రైతులను ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు హెక్టారుకు రూ.50వేల నష్టపరిహారం ఇస్తున్నారన్నారు. ఏవో రవిప్రకాష్, టీడీపీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి, లద్దగిరి సింగిల్‌విండో అధ్యక్షుడు పట్టి క్రిష్ణ, మాలమహానాడు మునిస్వామి, అయ్యప్ప పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీలు ప్రారంభం



స్విమ్మర్లతో మాట్లాడుతున్న కార్యదర్శి కృష్ణ

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కిసాన్ ఘాట్ డీఎస్‌ఏ స్విమ్మింగ్ పూల్‌లో జిల్లా స్కూల్ గేమ్స్ అండర్-14, 17 స్విమ్మింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. కార్యదర్శి టి.కృష్ణ మాట్లాడుతూ ప్రతిభ చాటి జిల్లా పేరు నిలపాలన్నారు. 50 మంది స్విమ్మర్లు హాజరయ్యారు. పీడీ సంఘం అధ్యక్షుడు లక్ష్మయ్య, కోచ్ నటరాజ్, పీడీలు పద్మలత, నాగేశ్వరి, మల్లికార్జున పాల్గొన్నారు.

అద్దెబస్సు కార్మికులకు భద్రత కల్పించాలి



కొత్తబస్టాండ్‌లో ధర్నా చేస్తున్న కార్మికులు

కర్నూలు రూరల్ అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ అద్దె బస్సుల కార్మికులకు భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి అంజిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ డిపోకు చెందిన అద్దెబస్సు డ్రైవర్ మహమ్మద్‌పై చేసిన దాడిని ఖండిస్తూ బుధవారం కొత్తబస్టాండ్ వద్ద ధర్నా చేశారు. కార్మికులపై దాడిపై ఆర్టీసీ యాజమాన్యం జోక్యం చేసుకోవాలని కోరారు. రద్దీకి అనుగుణంగా తగినన్ని బస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. కార్మికులు సుబ్బయ్యగౌడ్, శ్రీనివాసులు, రాంబాబు, శ్రీనివాసులు, చెన్నకేశవులు, మద్దిలేటి, ప్రకాష్, మధు పాల్గొన్నారు.

పోరాటయోధుడు కొమరం భీమ్

కర్నూలు అర్బన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల పోరాటయోధుడు కొమరం భీమ్ అని పట్నం రాజేశ్వరి అన్నారు. బుధవారం నగరంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ హక్కుల వేదిక కార్యాలయంలో 85వ వర్ధంతి నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మితో కలిసి నివాళి అర్పించారు.

సిబ్బందికి స్టేషనరీ పంపిణీ



స్టేషనరీ అందిస్తున్న మేనేజర్ చిన్నరాముడు

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): నగర పాలక కార్యాలయ, సచివాలయ ఉద్యోగులకు మేనేజర్ ఎస్.చిన్నరాముడు బుధవారం స్టేషనరీ పంపిణీ చేశారు. సిబ్బందికి సౌకర్యాలను కల్పిస్తే సేవల నాణ్యతను పెంపొందించవచ్చన్నారు. సిబ్బందికి అవసరమైన అన్ని సదుపాయాలను దశలవారీగా అందిస్తున్నామని తెలిపారు. శ్రీదేవి, సుభద్ర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మోదీ సభను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

● పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): 16న కర్నూలులో ప్రధాని మోదీ బహిరంగసభను విజయవంతం చేద్దామని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం దూపాడులో కల్లూరు అర్బన్ 16 వార్డులు, ఓర్వకల్లు, పాణ్యం, గడివేముల, కల్లూరు మండలాలనాయకులతో సమావేశమయ్యారు. బహిరంగసభకు కూటమి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు. పేద, మధ్యతరగతి ప్రజల కొనుగోలు శక్తిని పెంచేలా కేంద్ర ప్రభుత్వం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ 2.0 సంస్కరణలు చేపట్టిందన్నారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేష్ జిల్లాకు రావడం శుభసూచకమన్నారు. విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్, కె.పార్వతమ్మ, డైరెక్టర్లు ఎస్‌కె.శ్రీనివాసరావు, పీటీవీ.సుబ్బయ్య, పెరుగు పురుషోత్తంరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్లు ఈవీ.రమణ, డి.శేఖర్ పాల్గొన్నారు.

భోజనం సరిగాలేకపోవడంపై ఆగ్రహం

నగరంలోని బి.క్యాంపు జూనియర్ కళాశాల, ఒకేషనల్ కళాశాలలో ఎమ్మెల్యే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉడికీ ఉడకని పప్పు, అన్నం వడ్డిస్తున్నారని విద్యార్థులు ఫిర్యాదు చేయగా, సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని విద్యార్థులకు మాటీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎస్పీ మహబూబ్‌బాషా, ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్, సరళ తదితరులు పాల్గొన్నారు.

● జీఎస్టీ సంస్కరణలతో వాహన ప్రియులకు మేలు జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. నగరంలోని ఓ కార్ల షోరూంలో బుధవారం ఎమ్మెల్యే పాల్గొని యజమాని వెంకటేశ్వరరెడ్డిని కలిసి వివారలను ఆరా తీశారు. పియూ మాదన్న, కాసాని మహేష్‌గౌడ్, వాకిటి మాదేష్, దేవేందర్‌రెడ్డి, చెన్నయ్య, సోమశేఖర్‌రెడి పాల్గొన్నారు.

'అల్లర్లు సృష్టించడానికి వైసీపీ కుట్ర'



మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అల్లర్లు సృష్టించేందుకు వైసీపీ కుట్ర పన్నుతోందని టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ఆరోపించారు. బుధవారం మండలంలోని హుస్సేనాపురం గ్రామంలో మాట్లాడుతూ తాడేపల్లి ప్యాలెస్ నుంచి వచ్చిన డైరెక్షన్‌తోనే చిత్తూరు జిల్లాలో డా.అంబేడ్కర్ విగ్రహానికి వైసీపీ నాయకులు నిప్పు పెట్టారన్నారు. ఈ కుట్రలో వైసీపీ సర్పంచు గోవిందయ్యతో పాటు పలువురి ప్రమేయం ఉందన్న విషయం సాక్షాధారాలతో బట్టబయలైందన్నారు. ప్రభుత్వంపై బురద జల్లే కుట్రలో భాగంగా విగ్రహంపై దాడికి పాల్పడ్డ వైసీపీని, జగన్‌రెడ్డిని రాష్ట్రం నుంచి బహిష్కరించాలన్నారు. గతంలో మాస్కు అడిగినందుకు డా.సుధాకర్‌ను వేధించి చంపడం, వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు తన డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని దారుణంగా హతమార్చడం వైసీపీకి అలవాటేనన్నారు. వైసీపీ ఎన్ని కుట్రలు పన్నినా రాష్ట ప్రభుత్వం తిప్పికొడుతుందని హెచ్చరించారు.

అధికారులు భాధ్యతగా పనిచేయాలి

సి. బెళగల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల అధికారులు భాధ్యతగా పనిచేయాలని ఎంపీపీ బొంతల మునెప్ప కోరారుజ బుదవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీవో రాణెమ్మ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల కేంద్రం నుంచి కంబందహాల్ వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతల పడి అధ్వానంగా ఉందని, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. బస్సులను సకాలంలో నడపాలని ఆర్‌టీసీ అధికారులను కోరారు. ఆర్ఎంబీ ఏఈ ప్రిన్సి మాట్లాడుతూ రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చి వేస్తామన్నారు. ప్రిన్సిపాల్ చింతలయ్య మాట్లాడుతూ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో తాగునీరు, ప్రహరీ లేదన్నారు. డీటీ పురుషోత్తం, ఆర్ఎంబీ డీఈ మహబుబ్‌ఖాన్, ఏవో మల్లేష్‌కుమార్, ఎంఈవో జ్యోతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్ఎంబీ ఏఈ ప్రిన్సి

పంచాయతీల ఆదాయం పెంచాలి

కర్నూలు రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల ఆదాయం పెంచాలని ఇన్‌చార్జి ఎంపీడీవో జేమ్స్ కృపావరం ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, డిజిటల్ ఇంజనీర్లు, డిజిటల్ అసిస్టెంట్లకు ఓన్‌సోర్స్ రెవెన్యూ అంశంపై శిక్షణ ఇచ్చారు. ఆదాయ మార్గాలను అన్వేషించి, సృష్టిపై కూలంకుశంగా వివరించారు. పరిపాలన అధికారి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి : సీపీఐ

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం నగరంలోని 10,11,12 సచివాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సచివాలయాల పరిధిలో చాలా మంది కూలీ పని చేసుకుంటున్నారని తుంగభద్రనదితో పాటు హంద్రీకి వరదలు వస్తే ఇక్కడ నివసిస్తున్న పేదలు నిరాశ్రయులవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం బాధితులకు 2 సెంట్ల స్థలం చొప్పున ఇళ్ల స్థలం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దంబోళం శ్రీనివాసరావు, రబియా, దేవిబాయ్, అన్వర్‌బాషా పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యం ప్రదర్శించండి



క్రీడాకారులతో శ్రీదేవి

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): క్రీడానైపుణ్యంతో విజేతలుగా నిలవాలని సోషల్ వెల్ఫేర్ అధికారి డా.శ్రీదేవి విద్యార్థులకు సూచించారు. బుధవారం చిన్నటేకూరు సోషల్ వెల్ఫేర్ పాఠశాల క్రీడా మైదానంలో జిల్లా స్కూల్ గేమ్స్ అండర్-19 కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతులు తేవాలని సూచించారు. కార్యదర్శి రామవేంద్ర, రగ్బీ రామాంజనేయులు, శేషు, ప్రకాష్, పరుశురావుడు తదితర పీడీలు పాల్గొన్నారు.

మెడికవర్ హోం హెల్త్ కేర్ ప్రారంభం



పోస్టర్ విడుదల చేస్తున్న వైద్యులు

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మెడికవర్ హాస్పిటల్ హోం హెల్త్‌కేర్ సేవలను బుధవారం కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు, డీసీహెచ్ఎస్ డా.జఫరుల్లా ప్రారంభించారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఇంటి వద్దే రోగులకు తక్షణ వైద్య సాయం అందుతుందన్నారు. మెడికవర్ హాస్పిటల్ కర్నూలు హెడ్ వై.మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ హోం హెల్త్ కేర్ ద్వారా శాంపిల్ కలెక్షన్, కేర్ టేకర్, నర్సింగ్ డాక్టర్ విజిట్ తదితర సేవలు 24 గంటలు అందు బాటులో ఉంటాయని 04068334455 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

నేడు జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం

కర్నూలు అర్బన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్లు ఏఐసీసీ సభ్యుడు, నంద్యాల డీసీసీ ప్రెసిడెంట్ జె.లక్ష్మి నరసింహ తెలిపారు. బుధవారం మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి గణేష్ యాదవ్ హాజరవుతారన్నారు. ఉదయం 10 గంటలకు జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నియోజవర్గాల ఇన్‌చార్జిలతో వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలితో కలిసి సమీక్షిస్తారని పేర్కొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్

కల్లూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యమని కర్నూలు ఏడీఈ-2 కె.చంద్రమోహన్ బుధవారం తెలిపారు. ఓల్డ్‌టౌన్, బి.క్యాంపు, కల్లూరు ఇండస్ట్రీయల్ ఏస్టేట్ సెక్షన్లలో ఫ్యూజ్ ఆఫ్ కాల్స్ పరిష్కారానికి ఏఈలను సంప్రదించాలని సూచించారు. ఓల్డ్‌టౌన్ - 9440813359, బి.క్యాంపు-9440813360, ఇండస్ట్రీయల్ ఏస్టేట్-9440816228 నెంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

మూకుమ్మడి సెలవు

కల్లూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగులు కదంతొక్కారు. జిల్లా విద్యుత్ ఉద్యోగులు మూకుమ్మడిగా సెలవుపెట్టి తిరుపతి కార్పొరేట్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ఆందోళనకు తరలి వెళ్లారు. దీంతో కార్యాలయాలు వెలవెలబోయాయి.

ఆదాయం సమకూర్చుకోవాలి

సి. బెళగల్, అక్టోబరు 8 (ఆంధ్ర జ్యోతి): ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చుకోవాలని ఎంపీడీవో రాణెమ్మ తెలిపారు. ఇంటింటి సర్వే చేసి, కుటుంబ సభ్యుల వివరాలను అన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సూపరింటెండెట్ శ్రీనివాసులు, ప్రకాశ్‌రాజు ఉన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించాలి



విజేతలకు బహుమతులు ఇస్తున్న రిజిస్ట్రార్ శ్రీనివాస్

కర్నూలు అర్బన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపులపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని రిజిస్ట్రార్ జీ. శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం క్లస్టర్ యూనివర్సిటీలో జీఎస్టీ 2.0 పై పోటీలు నిర్వహించారు. జీఎస్టీపై వ్యాసరచన, వక్తృత్వ, పెయింటింగ్, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించి, విజేతలను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డీన్‌లు నాగరాజు శెట్టి, మహ్మద్ వాహీజ్, అక్తర్ భాను, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు నారాయణ

13న ప్రమాణ స్వీకారం

ఓర్వకల్లు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం ఈ నెల 13న నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకులు నారాయణ రామచంద్రుడు అన్నారు. బుధవారం హుశేనాపురం గ్రామంలో మాట్లాడు తూ ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్ హాజరవుతున్నారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు. చైర్మన్‌గా హుశేనాపురం గ్రామానికి చెందిన కాటినేని నారాయణ, ధర్మకర్తలుగా రామచంద్రుడు అలియాస్ కాకి దేవేంద్ర, ఎం.వరలక్ష్మి, ఎల్. లక్ష్మిదేవి, ఎం.లక్ష్మిదేవి, పి.లక్ష్మిదేవి, ఎం.పెద్దమల్లయ్య, లక్ష్మినారాయణ, బి.రామాంజనేయ శర్మ, ఎం.పుల్లమ్మ తదితరులు ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు.

28 నుంచి 18 శాతానికి జీఎస్టీ



వాహనాన్ని పరిశీలిస్తున్న నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్‌ఏపీ కళ్యాణ మండపంలో వాణిజ్య పన్నుల శాఖ అధికారులు జీఎస్టీ తగ్గింపు ప్రదర్శన నిర్వహించి వినియోగదారులకు అవగాహన కల్పించారు. బీజేపీ నాయకుడు సారాయి రంగస్వామి మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలపై జీఎస్టీ స్లాబ్ 28 శాతం నుంచి 18 శాతానికి కేంద్ర ప్రభుత్వం తగ్గించిందన్నారు. వినియోగదారులకు లబ్ధి చేకూరేలాగా ప్రధానమంత్రి మోదీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అన్నారు. వెంకటేశ్వర్లు సాయిప్రదీప్ నాగేంద్ర, శ్రీరామ్ యాదవ్, వినియోగదారులు పాల్గొన్నారు.

వాల్మీకి ఆలయానికి కేవీ సుబ్బారెడ్డి విరాళం



మాట్లాడుతున్న డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి

కర్నూలు కల్చరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని లక్ష్మీపురం గ్రామంలో వాల్మీకి ఆలయ నిర్మాణానికి విద్యాసంస్థల అధినేత డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి రూ.2 లక్షల విరాళం ప్రకటించారు. బుధవారం రాత్రి లక్ష్మీపురం గ్రామంలో వాల్మీకి జయంతి సందర్భంగా శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. కార్పొరేటర్ నారాయణరెడ్డి, సత్యం రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, టీడీపీ నాయకుడు పుల్లారెడ్డి పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం : ఎమ్మెల్యే



మోటార్లను ఆన్ చేస్తున్న ఎమ్మెల్యే

సి. బెళగల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే లక్ష్యమని, ప్రభుత్వ ధ్యేయమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. బుధవారం గుండ్రేవుల సమీపంలోని క్రిష్ణదొడ్డి ఎత్తిపోతల పథకం నుంచి నీటి విడుదలను సింగిల్ విండో ప్రసిడెంట్ డాక్టర్ తిమ్మప్పతో కలిసి ప్రారంభించారు. చేశారు. మండలంలోని సంగాల, చింతమానుపల్లె, పులకుర్తి, రేమట ఎత్తిపోతల పథకాల అన్ని మోటార్లు అన్ చేశామన్నారు. కిష్ణదొడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా 5 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఎల్‌ఎస్ డీఈ సుబ్బరాయుడు, ఏఈ సూర్యప్రకాశ్, తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీవో రాణెమ్మ, కన్వీనర్ చంద్రశేఖర్, దూద్‌వలి, బాలజివెంకటేశ్, బీమన్న దనుంజయుడు రైతులు ఉన్నారు.

కార్యదర్శుల కమిటీ ఎన్నిక

సి. బెలగల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 18 గ్రామ పంచాయతీ కార్యదర్శుల కమిటీని జిల్లా సెక్రెటరీ అభిషేక్ అధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజేశ్, ప్రధాన కార్యదర్శిగా మద్దిలేటిని ఎన్నుకున్నారు. రాజేశ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎర్పడి రెండు సంవత్సరాలు కావస్తున్నా ఉద్యోగులకు ఇవ్వాల్సిన డీఏ, బకాయిలను ఇవ్వలేదన్నారు. ఉద్యోగులు ఏకమై ఉద్యోగులకు ఉద్యమం చేయాలని కోరారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



పోస్టర్ విడుదల చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువకులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని వైద్యుడు డా.రమణ అన్నారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం సీఆర్ భవన్‌లో పోస్టర్లను విడుదల చేశారు. త్యాగానికి, ధైర్యానికి ప్రతీక భగత్‌సింగ్ అన్నారు. 23 ఏళ్ల వయస్సులోనే నవ్వుతూ ఉరి కొయ్యను ముద్దాడారని కొనియాడారు. కులమత రహిత సమాజ నిర్మాణానికి ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కె.శ్రీనివాసులు, బీసన్న, చంటి, అంజి తదితరులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి గ్రీన్‌సిగ్నల్

- ఆదోనిలో రూ.4.10 కోట్ల నిధులు మంజూరు
- మరో కీలక మార్గానికి రూ. 2.10 కోట్లు
- నిధుల మంజూరుపై ప్రజల హర్షం

ఆదోని, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆదోని నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి, మరమ్మతులకు భారీగా నిధులు మంజూరు అయ్యాయి. రూ.4.10 కోట్లకు పైగా నిధులతో రెండు కీలకమైన రహదారుల అభివృద్ధికి ఎమ్మెల్యే పార్థసారధి కృషి ఫలించింది. ఈ రోడ్లు అందుబాటులోకి వస్తే రైతుల రవాణా కష్టాలు తీరడంతో పాటు పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తగ్గే అవకాశం ఉంది. బసాపురం రహదారికి రూ.2 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో మొత్తం 5 కి.మీ. దూరం వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. ముఖ్యంగా మార్కెట్‌యార్డు గేటు నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు ఉన్న 700 మీటర్ల మార్గంలో సీసీ రోడ్డు, అక్కడి నుంచి బసాపురం వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. ఈ రహదారుల నిర్మాణం చేపడితే మార్కెట్‌యార్డుకు నిత్యం వేల సంఖ్యలో పంట ఉత్పత్తులు తీసుకొచ్చే రైతులకు రవాణా ఇబ్బందులు తగ్గుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. -

పట్టణంలో మరో కీలక మార్గానికి రూ.2.10 కోట్లు

పట్టణంలో రద్దీ ప్రాంతాల్లో ఒక్కటైన ఆదోని తిమ్మారెడ్డి బస్టాండు నుంచి ఆర్టీఓ కార్యాలయం వరకు బీటీ రోడ్డు వేయడానికి రూ.2.10 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులలో కొంత భాగాన్ని ఇస్వీ దగ్గర ఉన్న ఓవర్ బ్రిడ్జిపైన కూడా ఒక లేయర్ బీటీ రోడ్డు వేయడానికి వినియోగిస్తారు. అలాగే ఈ నిధులలో మిగిలిన మొత్తాన్ని కడితోట నుంచి హనువాలు వరకు 7.400 కి.మీ. సింగిల్ రోడ్డు నిర్మాణానికి నిధులను వెచ్చించనున్నారు.

బసాపురంలో బ్రిడ్జి అవసరంపై విజ్ఞప్తి

రహదారుల అభివృద్ధిని స్వాగతిస్తూనే, బసాపురం గ్రామస్తులు మరో కీలక విజ్ఞప్తిని ఎమ్మెల్యే ముందుంచారు. చిన్నపాటి వర్షం వచ్చినా గ్రామంలోకి నీరు వస్తున్నందున, వెంటనే బ్రిడ్జి ఏర్పాటు చేసి గ్రామస్తులను ఆదుకోవాలని తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్‌చౌదరి ఎమ్మెల్యేను కోరారు. బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మొత్తం మీద ఆదోని నియోజకవర్గంలో ఈ రహదారుల నిర్మాణం పూర్తి అయితే గ్రామీణ ప్రాంతాల ప్రజలు మరియు రైతుల కష్టాలు తీరడంతోపాటు పట్టణంలో మెరుగైన రవాణా వ్యవస్థ అందుబాటులోకి వస్తుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


రహదారులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పార్థసారధి

నేడు మద్దికెరకు ఎమ్మెల్యే రాక

మద్దికెర అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మద్దికెర గ్రామానికి ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు గురువారం ఉదయం ప్రభుత్వం రాయితీ కింద అందజేసే పప్పుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమానికి వస్తున్నారనీ జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, వ్యవసాయాధికారి రవి బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేసిన రాయితీ విత్తనాల పంపిణీ కొరకు రావడం జరుగుతుందని మద్దికెర ప్రాంత రైతులు రావాలని కోరారు.

క్రైస్తవుల సంక్షేమానికి కృషి

ఆలూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవుల సంక్షేమానికి సహకరించాలని బుధవారం ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి శివప్రసాద్‌లను కలిసి విన్నవించారు. క్రైస్తవుల సమాధులకు స్థలాలు కేటాయించి, పాస్టర్లకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ తాలూకా అధ్యక్ష కార్యదర్శులు మారెన్నపాల్, శ్యామ్‌బాబు కోరారు. క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బెనోహర్‌బాబు, విజయ్, ఏసన్న, రాజేష్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న తహసీల్దార్

దేవనకొండ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల్లిబండ గ్రామసేవకుడు లింగన్న (65) బుధవారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రామాంజినేయులు మృతుడి అంత్యక్రియాలకు రూ.10 వేలు ఆర్థిక సహాయం కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. ఆర్ఐ విజయబాస్కర్, జూనియర్ అసిస్టెంట్ మల్లికార్జున, వీఆర్వో సురీడు, తదితరులు ఉన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు ఎంతో మేలు


ప్రజలకు వివరిస్తున్న ఎంపీడీవో వరలక్ష్మి, అధికారులు

హాలహర్వి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం జీఎస్టీ పన్ను తగ్గించి పేదలకు ఎంతో ఊటరనిచ్చిందని ఎంపీడీఓ వరలకి& అన్నారు. బుధవారం హాలహర్విలో జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. జీఎస్టీ పన్ను తగ్గింపు వల్ల అన్నిరంగాల పేద ప్రజలకు ఎంతో ఆదాయం మిగులుతుందని, సూపర్ జీఎస్టీగా ప్రజలు ఆశించినంతగా అన్ని సరుకుల ధరలు తగ్గడం వల్ల పేదోడికి భారం తగ్గినట్లు అయ్యిందన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ నాగరాజు, కార్యదర్శి శ్రీనివాసులు, గ్రామ సర్పంచ్ మల్లికార్జున పాల్గొన్నారు.

మద్దికెర : కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ ధరలను తగ్గించడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలకు, వ్యాపారులకు ఓ వరం లాంటిదని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి పెరవలి రామాంజులు, నాగేంద్రగౌడు అన్నారు. బుధవారం మండల పరిధిలోని పెరవలి గ్రామంలో జీఎస్టీ కరపత్రాలను దుకాణ యజమానులకు, ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు ఉన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ఆదోని టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా మునిసిపల్ కార్యాలయంలో బుధవారం పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది, కౌన్సిల్ సభ్యులను బుధవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్డియాక్ పరీక్షా శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో పాల్గొన్న వారికి వైద్య సిబ్బంది లిపిడ్ ప్రొఫైల్ పరీక్షతో పాటు ఈసీజీ పరీక్షలను నిర్వహించారు. అవసరమైన వారికి గుండె పనితీరును సూచించే ఖరీదైన 2డీఎకో పరీక్షలను నిర్వహించారు. ఈ శిబిరాన్ని నిర్వహించడం జరిగిందని సీనియర్ డాక్టర్లు శ్రీనివాసులు, సైఫుల్లా అన్నారు. 168 మందికి పరీక్షలు నిర్వహించగా అందులో 92 మందికి 2డీ ఎకో పరీక్షలు చేసి సూచలను అందించడం జరిగిందన్నారు. కమిషనర్ కృష్ణ, హెల్త్ ఆఫీసర్ డా. సందీప్ కుమార్, చైర్ పర్సన్ లోకేశ్వరి, ఆర్వో నాసిర్ నిర్వాహకులను అభినందించారు. రోటరీ సభ్యులు సోమశేఖర్ రెడ్డి, సందీప్ రెడ్డి, భరత్ షా, వికాస్ జైన్, హుస్సేన్ బాషా హితేష్ పాల్గొన్నారు.

సంపద సృష్టిస్తేనే గ్రామాభివృద్ధి

తుగ్గలి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు అభివృద్ధి చెందాలంటే సంపద సృష్టించాలని ఎంపీడీవో విశ్వమోహన్, డిప్యూటీ ఎంపీడీవో శ్రీహరి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన తుగ్గలిలో గ్రామ పంచాయతీల అభివృద్ధిపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు జూనియర్ అసిస్టెంట్ రామబ్రహ్మం తదితరులు ఉన్నారు.

రతనాలసీమగా మార్చడానికి కృషి


పత్తికొండలో మాట్లాడుతున్న బీద రవిచంద్ర యాదవ్

పత్తికొండ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాయలసీమను రతనాలసీమను చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్సీ, టీడీపీ జోన్-5 ఇన్‌చార్జి బీద రవిచంద్ర యాదవ్ అన్నారు. పత్తికొండ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఆధ్వర్యంలో బుధవారం నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశానికి ఎంపీ బస్తిపాటి నాగరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డితో కలసి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రధాని ఐదోసారి రాష్ట్రానికి వస్తున్నారన్నారు. మన రాష్ట్రానికి ఆయన ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. తిరుపతి తరహాలో శ్రీశైలం పుణ్య క్షేత్రాన్ని కేంద్రప్రభుత్వంతో కలసి మెగాప్రాజెక్టును చేపట్టనుందన్నారు. దేశంలోనే మొదటిసారిగా డ్రోన్‌సిటీకి ప్రధాని కర్నూలులో శంకుస్థాపన చేయనున్నారని ఓర్వకల్లు నుంచి హిందూపురం వరకు పారిశ్రామిక కారిడార్‌ను కూటమి ప్రభుత్వం ఏర్పాటుచేయనుందన్నారు. ఈ ప్రాంత యువకు ఉపాధి అవకాశాలు అందుతాయన్నారు. హంద్రీనీవా, తెలు గుగంగ వంటి ప్రాజెక్టులను శంకుస్థాపన చేసింది ఎన్టీఆర్ అని గుర్తుచేశారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో..

రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఎంతో శ్రమిస్తున్నారని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ఎన్నిఇబ్బందులు ఎదురైనా వారు వెనకడుగు వేయకుండా ముందుకు సాగుతున్నారన్నారు. ప్రజలకు అందించే సంక్షేమపథకాలు పక్కదారి పట్టకుండా టీడీపీ నాయకులు, కార్యకర్తలు అండగా నిలవాలన్నారు. 16న జరిగే బహిరంగ సభకు పత్తికొండ నియోజకవర్గం నుంచి అధికసంఖ్యలో ప్రజలు తరలివెళ్లి విజయవంతం చేయాలని కోరారు.

పెద్దఎత్తున జన సమీకరణ చేయాలి

ఈనెల 16న కర్నూలులో జరిగే ప్రదాని బహిరంగసభకు గ్రామ గ్రామం నుంచి నాయకులు కార్యకర్తలు తరలిరావాలని, ప్రజలను కార్యక్రమంలో పెద్దఎత్తున భాగస్వాములను చేయాలని ఎంపి బస్తిపాటి నాగరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. ఈబహిరంగ సభను ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారని మన నాయకుడి ఆలోచనకు మనం అండగా నిలిచి బహిరంగసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఘర్షణ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

ఆదోని రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): చిప్పగిరి మండలం బంటనహాళ్ గ్రామానికి చెందిన తండ్రీకొడుకులైన చిన్న బసిరెడ్డి, భూపాల్ రెడ్డిలకు కోర్టు జైలు శిక్ష విధించింది. కోర్టు లైజింగ్ ఎఎస్ఐ నరసింహులు తెలిపిన వివరాల మేరకు 2016 జూలై 26న గ్రామానికి చెందిన ఫిర్యాదు దారుడు ధనుంజయరెడ్డి, నిందితులైన చిన్న బసిరెడ్డి, భూపాల్‌రెడ్డి మధ్యన ఇంటి విభాగపు పంపకాల పరిష్కారంలోభాగంగా, ఘర్షణ చోటుచేసుకొంది. ఈ క్రమంలో ధనుంజయరెడ్డిని నిందితులు కొడవళ్లతో దాడి చేసి గాయపర్చారు. దీంతో ఫిర్యాదు మేరకు చిప్పగిరి పోలీస్‌స్టేషన్‌లో భూపాల్‌రెడ్డి, చిన్నబసిరెడ్డిలపై కేసు నమోదైంది. బుధవారం కోర్టు విచారణలోభాగంగా, నింధితుడిపై నేరం రుజువు కావడంతో ఆదోని అసిస్టెంట్ సెషన్ కోర్టు జడ్జి యజ్ఞ నారాయణ ఏ-1ముద్దాయి భూపాల్‌రెడ్డికి 5 సంవత్సరాల జైలు శిక్షతోపాటు రూ.10వేలు జరిమాన, ఏ-2 చిన్న బసిరెడ్డికి మూడు సంవత్సరాల జైలు శిక్షతోపాటు రూ.10వేలు జరిమానా విధించారు. ఈ కేసు పూర్వపరాల గూర్చి పబ్లిక్ ప్రాసిక్యూటర్ మోతిలాల్ నాయక్ వాదనలు వినిపించారు.

క్రీడాభివృద్ధికి కృషి చేయాలి


మాట్లాడుతున్న వ్యాయామ ఉపాధ్యాయులు

తుగ్గలి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు క్రీడలకు మక్కువ కల్పించి క్రీడాభివృద్ధి కోసం కృషి చేయాలని వ్యాయామ ఉపాధ్యాయుల జిల్లా కార్యదర్శి చందు నాయక్, మండల కోఆర్డినేటర్, నియోజకవర్గ కోఆర్డినేటర్ పాండురంగ రాజు, వేణుగోపాల్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని రామలింగాయపల్లెలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించడం కోసం పాఠశాల క్రీడా మైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి పోటీలను రామలింగాయపల్లె జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ మండల స్థాయి పోటీల్లో కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో, చెస్, యోగా తదితర పోటీలను నిర్వహిస్తున్నామనీ, ఈ పోటీల్లో ఎన్నికైన వారు డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు రంగస్వామి, భాస్కర్ నాయక్, ఫక్కీరప్ప, ఎస్ఈ రంగస్వామి, విజయలక్ష్మి, సలోమి ఉన్నారు.

బంగారమ్మ దేవాలయానికి విరాళాలు


విరాళాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

ఆదోని రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆదోని మండలం గణేకల్లు గ్రామంలో వెలసిన బంగారమ్మవ్వ గుడి నిర్మాణం జరుగుతోంది. దీంతో గ్రామానికి చెందిన పెద్దలు విరాళాల సేకరణ చేపట్టారు. బుధవారం టీడీపీ సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు రూ.51,116లు, యువ నాయకుడు మారుతి నాయుడు రూ.51,116లు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆరేకల్లు రామకృష్ణ రూ.5వేలు, సీనియర్ నాయకులు రంగస్వామి నాయుడు రూ.15,000లు, భారతి స్కూలు యజమాని బోయ దుర్గేష్ రూ.30వేలు, టౌన్ టీడీపీ ప్రెసిడెంట్, మాజీ కౌన్సిలర్ బోయ తిమ్మప్ప రూ.10వేలు, ప్రముఖ కాంట్రాక్టర్ బాబు నాయుడు రూ.10వేలు, కపటి మాజీ సర్పంచు మాదేవ్ రూ.2,500లు విరాళాలను గ్రామానికి చెందిన ఐ టీడీపీ సీనియర్ నాయకుడు విరుపాక్షికి అందజేశారు. దేవాలయ అభివృద్ధికి కట్టుబడి ఉంటామని ఉమాపతి నాయుడు పేర్కొన్నారు

మార్కెట్‌లో ప్రొటోకాల్ వివాదం

ఆదోని, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం రైతులకు రాయితీపై రూ.15కే భోజన సౌకర్యం ప్రారంభోత్సవం సందర్భంగా తీవ్ర ప్రొటోకాల్ వివాదం చోటు చేసుకుంది. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం ఈ భోజన సదుపాయాన్ని ఇస్కాన్ సంస్థకు అప్పగించడం వరకు బాగానే ఉన్నా, ప్రారంభోత్సవంలో మార్కెట్‌యార్డు కమిటీ చైర్‌పర్సన్ శారద పేరు, ఫోటో లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కార్యక్రమం కోసం ఏర్పాటు చేసిన స్వాగత బ్యానర్‌పై ముఖ్య అతిథిగా విచ్చేసిన స్థానిక ఎమ్మెల్యే పార్థసారథికి మాత్రమే స్వాగతం... సుస్వాగతం అంటూ పేరు ప్రస్తావించారు. మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్‌ను పూర్తిగా విస్మరించడం అక్కడున్న వారందరినీ నివ్వెరపరిచింది. మార్కెట్ కమిటీలోనే అత్యున్నత పదవిలో ఉన్న చైర్‌పర్సన్‌ను విస్మరించడం చర్చనీయాంశమైంది.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి: ఎమ్మెల్సీ


విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్

వెల్దుర్తి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో గోవర్ధనగిరి గ్రామంలో గ్రామనాయకుడు రామచంద్రుడు ఆధ్వర్యంలో వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ కార్యకమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ ఎమ్మెల్సీ మధుసూదన్, కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వలసల రామకృష్ణుడు హాజరై భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బారాయుడు, బలరాంగౌడు, జయరాముడు, వెంకటేశ్వర్లు, రామచంద్రనాయుడు, బోయపాటి శ్రీను పాల్గొన్నారు.

పత్తికొండ టౌన్: మహర్షి వాల్మీకి జయంతిని అధికారికంగా జరపాలని రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినప్పటికీ జిల్లా పరిధిలోని అనేక ప్రాంతాల్లో ప్రభుత్వ ఆదేశాలను విస్మరించి వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను జరపని సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి క్రాంతినాయుడు డిమాండ్ చేశారు. బుధవారం కర్నూలులో డీఈఓ శామ్యూల్‌పాల్‌కు వినతి పత్రం అందించారు. వాల్మీకి సంఘం నాయకులు అర్జున్, పుల్లి, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పదవితో బాధ్యత పెరిగింది

ఆదోని టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : వైఎస్ఆర్‌సీసీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా తనను ఎంపిక చేయడంతో తన పై పార్టీ బాధ్యత మరింత పెరిగిందని పట్టణానికి చెందిన వైసీపీ కౌన్సిలర్ ఫయాజ్ అహమ్మద్ అన్నారు. పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా ఎంపిక చేసినట్లు పార్టీ వర్గాల నుండి బుధవారం ఆయనకు సమాచారం అందింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థి నాయకుడిగా ఎదిగిన తనకు నమ్మకంతో రాష్ట్రస్థాయిలో పదవి ఇవ్వడం పట్ల పార్టీ అధినేత జగన్‌తో పాటు జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి, స్థానిక మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కారంతో పాటు, పార్టీ ప్రతిష్ఠ కోసం కృషి చేస్తానని అన్నారు.

పంట నమోదు చేసుకోండి

వెల్దుర్తి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మీ అన్నారు. బుధవారం రామళ్లకోట రైతుసేవా కేంద్రంలో జాతీయ ఆహార నూనెగింజల పథకంలో భాగంగా నీటి వసతి కలిగిన రైతులకు ఉచితంగా వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. పంట నమోదు చేసుకున్న వారికే ప్రభుత్వ రాయితీ ఫలాలు అందుతాయన్నారు. ఏడిఏ మోహన్ విజయ్‌కుమార్ వేరుశనగ పంటలో తీసుకోవాల్సిన మెళకువలు రైతులకు తెలియజేశారు. అనంతరం క్షేత్రస్థాయిలో పంట నమోదు వివరాలను తనిఖీ చేశారు. అలాగే బొమ్మిరెడ్డిపల్లె గ్రామంలో రాయితీపై శనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. రైతుసేవా కేంద్రాల్లో విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అక్బర్‌బాషా, సర్పంచి నిర్మల, ఎఫ్‌పీవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మైనార్టీ మహిళల నిరసన


అధికారులతో వాగ్వాదానికి దిగిన మహిళలు

ఆదోని టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 16వ వార్డు కౌడల్ పేటకు చెందిన మైనారిటీ మహిళలు, వార్డు కౌన్సిలర్ వైసీపీకి చెందిన హసీనా భానుతో కలిసి బుధవారం మునిసిపల్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. తమ వార్డులో మంజూరైన అభివృద్ధి పనులను నెలల తరబడి చేపట్టక పోవడంపై కమిషనర్, చైర్ పర్సన్, డీఈ లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కౌన్సిలర్ ఇబ్రహీం ఆరోపించడంతో కమిషనర్‌కు ఆయనకు మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. చివరికి వైస్ చైర్మన్ నరసింహులు జోక్యం చేసుకొని రెండు రోజులలో పనులను ప్రారంభించేలా హామీ ఇప్పించడంతో పరిస్థితి సద్దుమణిగింది. నిరసన తెలిపిన వారిలో సోఫియా, మైమున్‌బీ, నూర్జహాన్, సయ్యద్ తాహేర్‌భాను, ఫబానీ పాల్గొన్నారు.

రీ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

దేవనకొండ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహించే రీసర్వే పకడ్బందీగా చేయాలని తహసీల్దార్ రామాంజినేయులు సర్వేయర్లుకు, వీఆర్వోలను ఆదేశించారు. బుధవారం మండల పరిధిలోని తెర్నేకల్ సచివాయలంలో రీసర్వే చేసిన క్యూజీఐఎస్ వివరాలను పరిశీలించారు. రీసర్వే డీటీ అమీనా బేగం, వీఆర్వోలు మహమ్మద్ షఫీ, హనుమన్న, సర్వేయర్లు ఆశ్వర్థ, అనిల్‌కుమార్ ఉన్నారు.

పంచాయతీకి ఆదాయ వనరులు పెంచాలి

మద్దికెర, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో ఆదాయ వనరులు పెంచేందుకు అందరూ కృషి చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో స్వర్ణలత తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనం ముందు గ్రామ పంచాయతీ సొంత వనరులను సమకూర్చుకోవడం ఎలా అనే అంశంపై గ్రామ సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా తరగతులు జరిగాయి. సర్పంచులు బండారు సుహాసిని, మల్లికార్జున, కార్యదర్శులు శివకుమార్, సుధాకర్, హరిక్రిష్ణ, మల్లికార్జున, వన్నూరప్ప, మంజునాథ్, తదితరులు ఉన్నారు.

ఎప్పుడొస్తారో..? ఎప్పుడు వెళ్తారో..?


ఏపీఎం కార్యాలయంలో దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు

పత్తికొండ టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ పట్టణంలోని వెలుగు కార్యాలయంలో ఒక ఏపీఎంతో పాటు ఐదు మంది సీసీలు, కంప్యూటర్ ఆపరేటర్ విధులు నిర్వహిస్తున్నారు. మండలంలో 1350 పొదుపు సంఘాలు ఉండగా, ఒక్కో సీసీ కింద 8 విలేజ్ బుక్ కీపర్లు మహిళల ఆర్థిక స్వావలంబన కోసం పని చేస్తున్నారు. అలాంటి ప్రధాన కార్యాలయంలో ఓ అధికారి విధులకు సక్రమంగా హాజరు కావడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కోసారి మధ్యాహ్నం 12 గంటలైనా కార్యాలయ తలుపులు తెరుచుకోని సందర్భాలు కోకొల్లలుగా ఉన్నాయి. మరోపక్క 3 గంటలకే కార్యాలయం మూతపడిన సందర్భాలు ఉన్నాయంటూ పొదుపు మహిళలు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ ఏరియా కో ఆర్డినేటర్ రాధాకృష్ణను వివరణ కోరగా, గతంలో కార్యాలయంలో అధికారుల తీరుపై తనకు కూడా ఫిర్యాదు వచ్చాయని, అయితే అనేకసార్లు మందలించడం జరిగిందని, వీరి తీరు మార్చుకోకపోతే పై అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

ఉల్లి పంటను దున్నేశారు


ఉల్లి పంటను దున్నేస్తున్న దృశ్యం

మద్దికెర అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో ఖరీఫ్‌లో దాదాపు 4వేల ఎకరాల్లో ఉల్లి పంటను సాగు చేశారు. అలాగే ఎకరాకు రూ.30వేల మేర విత్తనాలకు, వ్యవసాయ పనులకు మందులకు పెట్టుబడులు పెట్టినట్లు రైతులు తెలిపారు. ఈ ఏడాది అధిక వర్షాలు పడటంతో పాటు దానికి తోడు గిట్టుబాటు ధర లేకపోవడంతో వ్యవసాయ కూలీలకు డబ్బులు కూడా వచ్చే పరిస్థితి లేదని మద్దికెర గ్రామానికి చెందిన రైతు వరదరాజులు తాను సాగు చేసిన ఏడు ఎకరాల్లోని ఉల్లి పంటను దున్నేశాడు. ఎడవలి గ్రామంలో రామాంజులు అనే వ్యక్తి తను సాగు చేసిన నాలుగెకరాల్లో ఉల్లి పంటను దున్నేశాడు. మరి కొంత మంది రైతులు పొలాల్లోనే వదిలేశారు.

కౌలుకు తీసుకుని సాగు చేశాను

ఏడెకరాల పొలాన్ని ఎకరా రూ.14వేలకు కౌలుకు చేసి ఏడెకరాల్లో ఉల్లి పంటను సాగు చేశాను. అధిక వర్షాలు, గిట్టుబాటు ధర లేకపోవడంతో దున్నేశాను. దాదాపు కౌలు, పెట్టుబడులు కలిపి ఎకరాకు రూ.30వేల చొప్పున రూ.2.10 లక్షల మేర నష్టం వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశాడు.

వరదరాజులు, రైతు, మద్దికెర

గ్రామాభివృద్ధిపై అవగాహన

నందవరం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): అధికారులు గ్రామాన్ని ఎలా అభివృద్ధి చేసుకోవాలో వారికి అదనపు ఎంపీడీవో సందీప్ అవగాహన కల్పించారు. బుధవారం నందవరం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులకు రెండో రోజుతో శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ అధికారులు పాల్గొన్నారు.







భక్తులకు మెరుగైన సేవలందించాలి

మంత్రాలయం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు మెరుగైన సేవలు అందించాలని మంచాల సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి అన్నారు. బుధవారం మంత్రాలయంలో వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర నిర్మించిన రాయర భీమ రెసిడెన్సీని వైసీపీ మండల కన్వీనర్ గుర్రెడ్డి భీమిరెడ్డి, జనార్దన్‌రెడ్డి, మల్లికార్జున, వీకేసీ రాఘవేంద్ర ఆధ్వర్యంలో రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. అనంతరం సత్య నారాయణ సావమి పూజల్లో పాల్గొన్నారు. ప్రదీప్‌రెడ్డి మాట్లాడుతూ కష్టపడి పనిచేసిన నాయకులను, కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. అనంతరం ప్రదీప్‌రెడ్డి, గుర్రెడ్డి భీమి రెడ్డిలను శాలువ, పూలమాలలతో సన్మానించారు. కార్యక్ర మంలో వైసీపీ నాయకులు ఎంపీటీసీ వెంకటేష్‌శెట్టి, మజ్జిగ బొజ్జప్ప, జక్కయ్య, శివకుమార్, రామాంజనేయులు, వైస్ సర్పంచ్ హోటల్ పరమేష్, జగదీష్, అమీన్, చంద్ర పాల్గొన్నారు.


ప్రదీప్‌రెడ్డి, గుర్రెడ్డి భీమిరెడ్డిలను సన్మానిస్తున్న నాయకులు

నూతన జీఎస్టీతో తగ్గనున్న ధరలు


వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న టీడీపీ నాయకులు

గోనెగండ్ల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన సీఎస్టీ 2.0 తో గణనీయంగా నిత్యావసర వస్తువులు, ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలు తగ్గనున్నాయని గోనెగండ్ల మండల టీడీపీ కన్వీనర్ తిరుపతయ్యనాయుడు, సింగిల్ విండో అధ్యక్షుడు రామాంజినేయులు, మహల్ రహంతుల్ల, కాంట్రాక్టర్ షేక్షావలి అన్నారు. బుధవారం గోనెగండ్లలోని పలు వీదులలో నూతన జీఎస్టీ 2.0పై ప్రజలలోకి తీసుకెళ్లే అవగాహన కల్పించే కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు డైరెక్టర్ ఫక్రుద్దీన్, రంగస్వామినాయుడు, అక్బర్‌వలి, శ్రీధర్, మేకల మునెప్ప, కొత్తింటి ఫక్రుద్దీన్, ఐటీడీపీ మండల అధ్యక్షుడు రాంపురం రఫీక్, రవి, టీఎన్‌ఎస్‌ఎఫ్ అధ్యక్షుడు రమేష్‌నాయుడు, శేషాద్రినాయుడు, పాముల అజీజ్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం జీఎస్టీ తగ్గింపుపై విద్యార్థినులకు వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ విజయరాణి తెలిపారు. మానవ వనరుల అభివృద్ధి, డిజిటల్ సాధికారత అనే అంశంపైన విద్యార్థినులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 50 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలు లక్ష్మయ్య, రవి, లక్ష్మీ, శ్రీనివాసులు విజేతలను ప్రకటించారు. మొదటి సంవత్సరం హన్సిక, ధరణి, వాసవి, రెండో సంవత్సరం లతీఫా, నందిని, మానసలు విజేతలుగా నిలిచారు. వీరికి ప్రిన్సిపాల్ విజయరాణి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారి హరికుమార్ పాల్గొన్నారు.

చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ మోసాలే


మాట్లాడుతున్న బుట్టా రేణుక

గోనెగండ్ల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలు అన్ని మోసాలేనని, ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకునేందుకు అదో ఎత్తు అని మాజీ ఎంపీ, నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బుట్టారేణుక అన్నారు. బుధవారం మండలంలోని పెద్దమరివీడు గ్రామంలో బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. బుట్టరేణుక మాట్లాడుతూ ప్రస్తుతం అకాల వర్షాల వల్ల రైతులు పంటలు నష్టపోయారని వారికి ఇప్పటి వరకు పరిహారం గురించి చంద్రబాబు ఎలాంటి హామీ ఇవ్వలేదని అన్నారు. బాబు షూరిటీ మోసం గ్యారెంటీకి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నీలకంఠ, కృష్ణారెడ్డి, బందేనవాజ్, మురారెడ్డి పాల్గొన్నారు.

వడ్డె మంజునాథ్‌కు మాతృవియోగం

● నివాళులర్పించిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి

కోసిగి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాగనూరు గ్రామానికి చెందిన తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు వడ్డె మంజునాథ్‌కు మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి వడ్డె లక్ష్మీదేవి మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీని వాసరెడ్డి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎల్లారెడ్డి, అమర్నాథ్ రెడ్డి, నాడిగేని మహాదేవ, కృష్ణారెడ్డి, నరసింహులు, ఉలి గయ్య, సోల్మాన్ రాజు, నీలకంఠ, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకంపై శిక్షణ

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని బనవాసి కృషి విజ్ఞానకేంద్రంలో బుధవారం తేనెటీగల పెంపకంపై శిక్షణ ప్రారంభించినట్లు ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం జాన్సన్, రాఘవేంద్ర చౌదరి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తేనెటీగల పెంపకంతో రైతులకు ఆదాయం అధికంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సహదేవరెడ్డి, మారుతేరు అశోక్‌కుమార్, మంజునాథ్, సుజాతమ్మ, శివశంకర్, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

మొక్కజొన్న విత్తనాలు పంపిణీ

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి, సహదేవరెడ్డిలు రైతులకు మొక్కజొన్న విత్తనాలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర వ్యవసాయ పద్ధతులను రైతులు తెలుసుకోవా లన్నారు. కార్యక్రమంలో మారుతేరు అశోక్‌కుమార్, మంజునాథ్, సుజాతమ్మ, శివశంకర్, మల్లికార్జునగౌడ్, రమేష్ పాల్గొన్నారు.

స్నేహితుల ఆపన్న హస్తం


బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

కోసిగి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కోసిగిలోని 4వ వార్డులో నివాసముంటున్న కమ్మరి వీరేష్ ఆచారి అలియాస్ శివస్వాముల గురుస్వామి (41) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మిత్రులు వీరేష్ ఆచారి కుటుంబానికి రూ.18వేలు ఆర్థిక సాయం అందించారు. భౌతిక కాయానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

కౌతాళం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కౌతాళంలోని రామలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప బుధవారం ఆలయ కమిటీ సభ్యులకు రూ.72వేల నగదును విరాళంగా ఆలయ కమిటీ సభ్యులు తిక్కయ్య, పూజారప్పలకు అందజేశారు. వారు మాట్లాడుతూ నూతన శివలింగం ఏర్పాటుకై దాతల నుంచి విరాళాలు సేకరిస్తున్నామని, గ్రామంలో చేప డుతున్న ఆలయ అభివృద్ధి పనులకు విరాళం ఇచ్చారన్నారు.





